PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 341 | విజయవాడ, ఆదివారం 14 జులై 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 14 July 2024 | Rs

వింబుల్డన్ టైటిల్ విజేత క్రేజికోవా

- ఫైనల్లో 7వ సీడ్ పాలినిపై గెలుపు

లోపలి పేజీలో..

గాజాలో ఆగని మారణకాండ.. 71 మంది మృతి

గాజా : అమెరికా దన్ను చూసుకుని ఇష్టానుసారం చెలరేగుతున్న ఇజ్రాయిల్ తాజాగా జరిపిన వైమానిక దాడిలో 71మంది పాలస్తీనీయులు చనిపోయారు. మరో 289 మంది దాకా గాయపడ్డారు. అక్టోబరు 7 దాడితో సంబంధమున్న హమాస్ మిలిటరీ చీఫ్ మహ్మద్ డెయిఫ్‌ను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు జరిపామని ఇజ్రాయిల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్ చెప్పినది పచ్చి అబద్ధమని హమాస్ వెంటనే ఖండించింది. ఇజ్రాయిల్ తన కిరాతక చర్య తీవ్రతను తక్కువ చేసి చూపేందుకే ఇటువంటి కట్టుకథలు అల్లుతోందని హమాస్ ఒక ప్రకటనలో తెలిపింది. పౌర ఆవాసాలపై ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే దాడి చేసి పెద్దయెత్తున మారణహోమం సృష్టించిందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్కూళ్లు, ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలపైన బాంబు దాడులు చేసిన ఇజ్రాయిల్ చివరికి సేఫ్ జోన్‌లపైనా దాడులకు తెగబడుతోంది. ఉత్తర రఫా నుండి ఖాన్ యూనిస్ వరకు మానవతా జోన్‌గా ఇజ్రాయిల్ ప్రకటించిన ప్రాంతం ముపసిలో ఈ దాడి జరగడం గమనార్హం.

సాగు కొంచెమే

వానలున్నా సాగని వ్యవసాయ పనులు

- ఈసారి ఖరీఫ్‌లో వింత ధోరణి
- కృష్ణా డెల్టాలో నీటి కటకట
- సీమ సహా మెట్ట ప్రాంతాల్లో సేద్యం నెమ్మది

(ఫైల్)

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ మారు సమృద్ధిగా వర్షాలు పడుతున్నా ఖరీఫ్ సేద్యం నెమ్మదిగా సాగుతోంది. జూలై రెండో వారం గడుస్తున్నా పంటల సాగులో చెప్పుకొనేంతగా పురోగతి లేదు. ప్రధాన జలాశయాల్లో నీరు లేని కారణంగా వరి సాగు తగ్గగా, వానలు పడుతున్నా మెట్ట పంటల సేద్యం ముందుకు కదలట్లేదు. గతేడాది కరువు వలన రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, తదితర జిల్లాల్లో సరిగ్గా సేద్యం జరగలేదు. ఈ తడవ అందుకు భిన్నం. ఆయా జిల్లాల్లో ఇప్పటికే కురవాల్సిన వర్షం కంటే అధికంగా వర్షం కురిసింది. అయినప్పటికీ పంటల సాగు నెమ్మదించడం కొత్త ధోరణి. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 81 లక్షల ఎకరాలు. ఈపాటికి 16.55 లక్షల ఎకరాల్లో పంటలు వేయాలి. కానీ 11.27 లక్షల ఎకరాల్లోనే వేశారు. సీజన్ నార్మల్‌లో 14 శాతం, ఇప్పటికి కావాల్సిన సాగులో 68 శాతం పంటలు సాగయ్యాయి. తీవ్ర వర్షాభావం తిష్ట వేసిన గత సంవత్సరంతో సమానంగా ఈ ఏడాదీ సాగు నమోదు కావడం గమనార్హం.

వర్షం 38 శాతం ఎక్కువ

ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి జూలై 13 వరకు సాధారణంగా 157 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 217 మిమీ పడింది. నార్మల్ కంటే 38.2 శాతం ఎక్కువ. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో సాధారణ స్థాయిలో, రాష్ట్రంలోని తతిమ్మా జిల్లాల్లో సాధారణ స్థాయి కంటే అధికంగా వర్షాలు కురిశాయి. తక్కువ వర్షం పడ్డ మండలాలు 50 లోపే. ఈ సారి రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ నార్మల్ కంటే ఎక్కువ వర్షం కురిసింది. నిరుడు ఈ జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ప్రభుత్వం కరువు మండలాలను కూడా ప్రకటించింది. ఎడారి జిల్లాగా పేరుబడ్డ అనంతపురంలో ఈ తడవ నార్మల్ కంటే అతి ఎక్కువ వర్షం నమోదైంది. అయితే సీమలో అధికంగా సాగు చేసే వేరుశనగ సాగులో జూలై రెండోవారం పూర్తయినా ఏమాత్రం పురోగతి లేదు. వేరుశనగను తొలకరి వానలకు రైతులు సాగు చేస్తారు. జూలై చివరాఖరుకల్లా సాగు దాదాపు పూర్తవుతుంది. ఆగస్టులో కొద్ది మేరకే సాగవుతుంది. కాగా ఇప్పటికి 14 శాతమే సాగైంది. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలు వేశారా అనుకుంటే తతిమ్మా మెట్ట పంటల సాగు కూడా పెద్దగా పెరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాధారంపై సాగు చేసే పంటలు కొద్దిమేరకే సాగయ్యాయి. తృణధాన్యాలు 13 శాతం, పప్పుధాన్యాలు 17 శాతం, మొత్తం ఆహార ధాన్యాలు 13 శాతం, నూనెగింజలు 14 శాతం సాగయ్యాయి. సాధారణంగా పత్తి ఈపాటికి ఊపుమీదుంటుంది. కానీ ఈ తడవ ఆ పంట సైతం 16 శాతమే సాగైంది.

ప్రమాదంలో కృష్ణా డెల్టా!

గోదావరి డెల్టా కొంత వరకు ఫర్వాలేదనిపిస్తుండగా కృష్ణా డెల్టా పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. ఈపాటికి ఇక్కడ వరి నారుమళ్లు పోయడం పూర్తి కావాలి. ప్రాజెక్టుల్లో నీరు లేక కాల్వలకు మొన్నటి వరకు నీరు విడుదల చేయలేదు. పులిచింతల ఎండిపోయింది. ఎగువనున్న నాగార్జున సాగర్, శ్రీశైలంలో నీరు లేదు. గోదావరిలో నీటి ప్రవాహం తగినంత లేని కారణంగా పట్టిసీమ మోటార్లను ఆలస్యంగా ఆన్ చేశారు. పట్టిసీమ కాల్వలో నీటి ప్రవాహం అంతంతమాత్రంగా ఉంది. మూడు రోజుల క్రితం ప్రకాశం బ్యారేజికి గోదావరి నీళ్లొచ్చాక కృష్ణా డెల్టా కాల్వలకు నీరు విడుదల చేశారు. డెల్టా కాల్వల్లో నీటి ప్రవాహం అరకొరగా ఉండటంతో చివరి భూములకు నీరందేసరికి బాగా సమయం పడుతుంది. కాగా ప్రస్తుతం విడుదల చేసిన నీరు తాగునీటి అవసరాలకే వినియోగించాలని ప్రభుత్వం చెబుతోంది. ఒక వేళ గోదావరిలో అనుకున్న స్థాయిలో ప్రవాహం లేక పట్టిసీమ నీరు రాకపోయినా, కృష్ణానదిలో ఎగువ నుంచి నీటి ప్రవాహం లేకపోయినా డెల్టాలో సాగు ప్రశ్నార్థకమవుతుంది. కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నికరంగా 9 లక్షల ఎకరాలకుపైన ఖరీఫ్‌లో వరి సాగవుతోంది. కృష్ణా డెల్టాలో పెద్ద సంఖ్యలో కౌలు రైతులు. నీరు రాకపోతే సాగు ఇబ్బందుల్లో పడుతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

భారీగా ఐపిఎస్‌ల బదిలీలు

- 23 జిల్లాలకు కొత్త ఎస్‌పిలు
- డిజిపి కార్యాలయంలో తొమ్మిది మంది రిపోర్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు బదిలీ అయ్యారు. 37 మంది ఐపిఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకేసారి 23 జిల్లాలకు కొత్త ఎస్‌పిలను నియమించారు. అలాగే తొమ్మిది మందికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రిపోర్టు చేయాల్సినవారిలో జిఆర్ రాధిక, డి మేరీ ప్రశాంతి, కె ఆరిఫ్ హఫీజ్, కె రఘువీరారెడ్డి, సిద్దార్థ్ కౌషల్, జిఎస్ సునీల్, పి జగదీష్, ఎస్ శ్రీధర్, ఎం సత్తిబాబు ఉన్నారు. కాగా విశాఖ సిటీ డిప్యూటీ కమిషర్ 1గా అజితా వేజెండ్లను, విశాఖ సిటీ డిప్యూటీ కమిషర్ 2గా తుహిన్ సిన్హాను, విజయనగరం ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికాగార్గ్‌ను, ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్‌లో లా అండ్ ఆర్డర్ డిప్యూటి కమిషనర్‌గా గౌతమి షాలిని, అనంతపురం పిటిసి నుండి ఇంటలిజెన్స్ ఎస్‌పిగా వి గీతాదేవిని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీల వివరాల పట్టిక 2వ పేజీలో

అల్ట్రాటెక్‌లో మరో ప్రమాదం

- 15 అడుగుల పైనుండి పడిన కోల్ బిన్

2

ఉత్తరాఖండ్‌లోని చమోలిలో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇండియా బ్లాక్ హవా

- 13 స్థానాల్లో 10 చోట్ల జయభేరి
- బిజెపికి దక్కింది రెండే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి కర్రు కాల్చి వాతపెట్టిన ఓటరు.. ఇప్పుడు ఉప ఎన్నికల్లోనూ కమలానికి గట్టి షాక్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 13 శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ 10 స్థానాల్లో ఘన విజయం సాధించింది. కాంగ్రెస్, టిఎంసి నాలుగేసి స్థానాల్లోనూ, ఆప్, డిఎంకె ఒక్కొక్క స్థానంలోనూ గెలుపొందాయి. బిజెపి రెండుచోట్ల మాత్రమే గెలుపొందగా, బీహార్‌లో బిజెపితో అంటకాగిన అధికార జెడియుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంకర్‌సింగ్ అధికార జనతాదళ్ (యు) అభ్యర్థి కళాధర్ ప్రసాద్ మండల్‌పై 8,248 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పశ్చిమ బెంగాల్ మానిక్‌తలా, బాగ్దా, రాణాఘాట్ దక్షిణ్, రాయ్‌గంజ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, అన్నింటిలోనూ టిఎంసి గెలుపొందింది. హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి, సుఖ్వీందర్ సింగ్ సఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ తన సమీప బిజెపి అభ్యర్థిపై హోశ్యర్‌సింగ్‌పై 9,399 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాలాగఢ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి హర్‌దీప్ సింగ్ బిజెపి అభ్యర్థి క్రిషన్ లాల్ ఠాకూర్‌పై 8,990 ఓట్ల తేడాతో గెలుపొందారు. హోశ్యర్‌సింగ్, కెఎల్ ఠాకూర్ 2022 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొంది, ఇటీవల బిజెపిలో చేరి, ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోవడం గమనార్హం. హమీర్‌పూర్‌లో బిజెపి అభ్యర్థి ఆశిష్ శర్మ 1,571 ఓట్ల స్వల్ప తేడాతో గెలుపొందారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మొహిందర్ భగత్ తన సమీప బిజెపి ప్రత్యర్థి శ్రీతల్ అంగురాల్‌పై 37,325 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తమిళనాడులో ఉప ఎన్నిక జరిగిన ఏకైక స్థానం విక్రవందిలో అధికార డిఎంకె అభ్యర్థి అన్నియుర్ శివ పిఎంకె అభ్యర్థి అంబుమణిపై 67,757 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లో ఉప ఎన్నిక జరిగిన అమర్‌వారా నియోజకవర్గంలో అధికార బిజెపి అభ్యర్థి కమలేష్ ప్రతాప్ షా ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థి ధీరన్ సా సుఖరామ్‌దాస్‌పై 3,027 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్‌లో లఖ్‌పత్ సింగ్ బుటోలా, మంగలౌర్‌లో ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్ కాంగ్రెస్ తరపున విజయం సాధించారు.

వామపక్ష అభ్యర్థుల ఓట్ల వివరాలు

పశ్చిమ బెంగాల్‌లోని బాగ్దాలో ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి గౌర్ బిశ్వాస్‌కు 8,189 ఓట్లు లభించాయి. మానిక్‌తలాలో సిపిఎం అభ్యర్థి రాజీబ్ మజుందార్‌కు 9,502 ఓట్లు వచ్చాయి. రాణాఘట్ దక్షిణ్‌లో సిపిఎం అభ్యర్థి అరిందమ్ బిశ్వాస్‌కు 13,082 ఓట్లు లభించాయి. ఈ మూడు స్థానాల్లోనూ వామపక్ష అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు.

టిడిపి కార్యాలయంలో సమస్యలు వింటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సమస్యల పరిష్కారానికి కమిటీ

- కక్షసాధింపు చర్యలొద్దు
- టిడిపి నాయకులతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులతో ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని పరిష్కరించే దిశగా కమిటీ ఉండాలని అన్నారు. తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో శనివారం ఉదయం పాల్గొన్నారు. అనంతరం టిడిపి కార్యాలయంలో చంద్రబాబు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ప్రతి రోజు పార్టీ కార్యాలయంలో ఇద్దరు మంత్రులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను మిగతా 2లో

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదలకు ప్రధానిని ఒప్పించండి

- సిఎంకు సిపిఎం విజ్ఞప్తి
- విస్తృత సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్లీలు ప్లాంటు ప్రైవేటీకరణను నిలుపుదల చేసేందుకు ప్రధానమంత్రిని ఒప్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. రెండు రోజులపాటు వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో జరిగిన సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశాలు శనివారం ముగిశాయి. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ బేబి, బి.వి రాఘవులు హాజరైన ఈ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయబోమని కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ తీర్మానంలో కోరారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్రంపై ఒత్తిడి చేయాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ కృషి వల్ల నేటికి ఒక్క శాతం కూడా ప్రైవేటు కాకుండా ప్లాంటు నడుస్తోందని తెలిపారు. రెండేళ్ల నుండి ఉత్పత్తి తగ్గించి విశాఖ స్టీల్‌ను నష్టాలకు నెడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసినా కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా చేసే హానికరమైన చర్యలను ఏ మాత్రం అడ్డుకోలేదని తీర్మానంలో పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ముందు, తరువాతా తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించి విశాఖ స్టీల్‌ను ప్రైవేటు కాకుండా కాపాడుతామని ప్రకటించిందని అయితే, ఇటీవల ఢిల్లీ వెళ్లిన సిఎం కేంద్రానికి సమర్పించిన వినతుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రస్తావన లేకపోవడం చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. జూలై 11వ తేదీన ప్లాంటును సందర్శించిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నడిపే అవకాశాలున్నాయని, ఒకటిన్నర నెలలో తగిన నిర్ణయాలు తెలియజేస్తామని పోరాట కమిటీ నాయకులకు చెప్పారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 32 మంది ప్రాణాలను బలిదానం చేసి సాధించుకున్న ఏకైక భారీ పరిశ్రమని, మిగతా 5లో

సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు. వేదికపై ఎం.ఏ బేబి, ఎంఎ గఫూర్ తదితరులు

పలు ప్రాంతాల్లో కుండపోత

- రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- నీట మునిగిన పంట పొలాలు
- అల్లూరి జిల్లాలో వ్యక్తి గల్లంతు

లోపలి పేజీలో..

(ఫైల్ ఫోటో)

అక్షయపాత్రకు అన్న క్యాంటీన్లు

ఒపిఎస్ పునరుద్ధరించాలి

- యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు డిమాండ్
- జిపిఎస్ గెజిట్ ప్రతుల దగ్ధం

జిపిఎస్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) ఉద్యోగులను గ్యారంటీ పెన్షన్‌స్కీం(జిపిఎస్)లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం(ఒపిఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ అమలుకై విడుదల చేసిన గెజిట్ ప్రతులను శనివారం దగ్ధం చేశారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యాయలంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఓపిఎస్ అమలు కోసం ఏళ్లతరబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్నారని తెలిపారు. గత వైసిపిప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. ఇచ్చిన హామీని విస్మరించి జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. తమ పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా ఉత్తర్వులను విడుదల చేయలేదన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం జిపిఎస్ చట్టాన్ని అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కొత్త ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని, వీటికి అనుగుణంగా పనిచేస్తుందని భావించామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నెలలోపే జిపిఎస్ అమలు చేస్తూ చట్టం అమల్లోకి తీసుకురావడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయలతో రాష్ట్రప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, సుందరయ్య మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామనిఅన్నారు. నెల రోజుల్లోనే ఉద్యమ బాటపట్టించే పరిస్థితి తెచ్చారని అన్నారు. జిపిఎస్‌పై తెచ్చిన జివో 54ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి రెడ్‌స్టార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఏ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ చేతికి ఎంటిఎన్‌ఎల్ కార్యకలాపాలు..!

- ఇరు సంస్థల విలీనంపై వెనుకడుగు

లోపలి పేజీలో..

సంగమేశ్వరం వద్ద గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీములు

బాలిక మృతదేహం కోసం సంగమేశ్వరం వద్ద గాలింపు

కంటైనర్ టెర్మినల్ మూసివేతతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ. వెయ్యికోట్లు నష్టం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేతతో వేలాదిమందికి ఉద్యోగాలు పోవడమే కాదు. రాష్ట్ర ఖజానాకు కూడా భారీ నష్టం జరుగుతోంది. ఒక అంచనా ప్రకారం కంటైనర్ టెర్మినల్ ద్వారా జరిగిన దిగుమతులు, ఏర్పడిన అనుబంధ సంస్థల నుండి దాదాపుగా వెయ్యి కోట్ల రూపాయలు వివిధ రకాల పన్నుల రూపంలో రాష్ట్ర ఖజానాకు జమ అయ్యేవి. ఇప్పుడు ఆ టెర్మినల్‌ను తరలించడం, అనుబంధ కంపెనీలు మూతపడటంతో ఆ మొత్తాన్ని రాష్ట్ర ఖజానా నష్టపోతోంది. ఈ మొత్తం కోసమైనా రాష్ట్ర ప్రభుత్వం అదాని గ్రూపుపై ఒత్తిడి చేసి, కంటైనర్ టెర్మినల్ ఇక్కడే కొనసాగేలా చూస్తుందని స్థానికులు భావించారు. అయితే, గత ప్రభుత్వం ఆ దిశలో స్పందించలేదు. టిడిపి నేతృత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఈ విషయమై పెదవి విప్పకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది.

అంతర్జాతీయ స్థాయిలో ...

2012 సెప్టెంబర్‌లో కృష్ణపట్నం పోర్టులో కెపిసిఎల్ కంటైనర్ టెర్మినల్ ప్రారంభమైంది. 725 మీటర్లు పొడవులో 5 ప్యానిమెక్స్ గంట్రె క్రెన్స్, 9రబ్బర్ టైప్ క్రెన్స్ దీనిని ఏర్పాటు చేశారు. అటోమెటిక్ హ్యాండిలింగ్ సిస్టమ్ ద్వార సింగిల్ విండో పద్ధతిలో కంటైనర్లు ఎగుమతులు దిగుమతులు జరపడపంతో చెన్నయ్, బెంగుళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లోని వ్యాపారులతో పాటు అంతర్జాతీయంగా పలు సంస్థలు ఈ పోర్టును లావాదేవీల కోసం ఎంచుకున్నాయి. అమెరికా, కెనడా, కెన్యా, యుఎఇ, శ్రీలంక, బంగ్లాదేశ్, థాయిలాండ్, మలేషియా, సింగపూర్, వియాత్నం, హాంగ్‌కాంగ్, ఇండోనేషియా దేశాల నుంచి ఎగుమతులు, దిగుమతులు పోర్టుకు వచ్చేవి. 2012 సంవత్సరంలోనే ఏడాదికి 12 లక్షల కంటైనర్లను ఇక్కడ నిర్వహించారు. ఇప్పుడు అది మరింత భారీగా పెరిగింది. నెల్లూరు నుంచి చెన్నయ్ పోర్టు 190 కిలో మీటర్లు దూరంలో ఉన్నప్పటికి కృష్ణపట్నం రవాణాకు అనువుగా ఉండి, తక్కువ రవాణా ఛార్జీలతో సరుకులు చేరడంతో ఇక్కడ నుంచే లావాదేవీలు చేయడానికి వ్యాపారులు మొగ్గు చూపారు. పత్తి, బియ్యం, గ్రానైట్, మిరప కాయలు, పండ్లు, రొయ్యలు, రాళ్లు, ఊరగాయలు, జాకెట్లు, కందిపప్పు, మినపప్పు, పొగాకు, తదితర వస్తువులు పోర్టు నుంచి ఎగుమతి అయ్యేవి. విదేశాల నుంచి సోలార్, ఫోన్లు, వాహనాల స్పేర్ పార్టులు, బ్యాటరీలు, ఇంజన్ అయిల్స్, స్కూటీలు, కార్ల స్పేర్‌పార్టులతో మిగతా 5లో

పలు ప్రాంతాల్లో కుండపోత

- రాష్ట్రం వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- నీట మునిగిన పంట పొలాలు
- అల్లూరి జిల్లాలో వ్యక్తి గల్లంతు

బాపట్లలో కూలిన పూరిల్లు

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం పాపవినాశనంలో కూలిన ఇల్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ తెరిపిలేకుండా విస్తారంగా వానలు పడ్డాయి. తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అల్లూరి జిల్లాలో గెడ్డలో కొట్టుకుపోయి ఒకరు గల్లంతయ్యారు. బాపట్ల, కృష్ణా జిల్లాల్లో రెండు ఇళ్లు కూలాయి.

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 48.8 మిల్లీమీటర్లు, తాళ్లపూడిలో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ముత్యాలమ్మగుడి ప్రాంతం, మాధవరాయునిపేట ప్రాంతాల్లో 50 ఎకరాల్లో, అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో 200 ఎకరాల్లో నారు మళ్లు నీట మునిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 41.3 మిల్లీమీటర్లు, ఏలూరు జిల్లాలో 21.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఎగువన మహారాష్ట్రలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 27.180 మీటర్లకు నీటిమట్టం చేరింది. దీంతో, దాదాపు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 30 మీటర్లకు నీటిమట్టం చేరితే దాదాపు 20కుపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ఈదురుగాలులకు చెట్లు రోడ్లపై పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగుల గుండా వరద నీరు పోటెత్తుతోంది. బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రపురం ఐటిడిఎకు మెళ్లే మార్గంలో కొండవాగు పొంగడంతో రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి.

అల్లూరి జిల్లా జికె.వీధి, దేవీపట్నం, చింతూరు, రంపచోడవరం ప్రాంతాల్లో వర్షం కురిసింది. రంపచోడవరంలోని కొండ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కొమరవరం వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రెండు గంటలసేపు గోకవరం నుంచి రంపచోడవరం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. గంగవరం మండలం నెల్లిపూడి వంతెనపై స్కూటీపై వెళుతున్న గొడగుమ్మి గ్రామానికి చెందిన మోహన్ నీటి ఉధృతికి కాలువలో కొట్టుకుపోయారు. ఆయన కోసం పోలీసులు, స్థానికులు గాలిస్తున్నారు.

కృష్ణా జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 60.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మచిలీపట్నంలో 156.8 మిల్లీమీటర్లు, కోడూరులో 152.6, పెడనలో 133.8, గూడూరులో 110.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి ఘంటసాల మండలం పాపవినాశనంలో ఇల్లు కూలింది. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో 67.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. భారీ వర్షాలతో పొలాల్లో నీరు నిలిచింది. సాగుకు సిద్ధం చేసిన భూముల్లో ఇసుక మేటలు, ఒండ్రు మట్టి చేరడంతో రైతులు మళ్లీ పొలాలను సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుగ్గిరాల మండలంలో అత్యధికంగా 148.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఐలవరం గ్రామంలోని మునిపల్లి నాగేంద్రకు చెందిన పూరిల్లు నేల కూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, సీతంపేట మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలోనూ వర్షాలు కురిశాయి.

ఐపిఎస్ అధికారుల బదిలీలు ఇలా..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1 కెవి మహేశ్వరరెడ్డి	ఓఎస్‌డి రంపచోడవరం	శ్రీకాకుళం ఎస్‌పి
2 వకుల్ జిందాల్	ఎస్‌పి బాపట్ల	విజయనగరం ఎస్‌పి
3 ఎం దీపిక	విజయనగరం ఎస్‌పి	అనకాపల్లి ఎస్‌పి
4 వి రత్న	మంగళగిరి ఎపిఎస్‌పి కమాండెంట్	సత్యసాయి ఎస్‌పి
5 ఎస్‌వి మాధవరెడ్డి	సత్యసాయి ఎస్‌పి	పార్వతీపురం ఎస్‌పి
6 విక్రాంత్ పాటిల్	పార్వతీపురం ఎస్‌పి	కాకినాడ ఎస్‌పి
7 ఎస్ సతీష్‌కుమార్	కాకినాడ ఎస్‌పి	గుంటూరు ఎస్‌పి
8 అమిత్ బర్దార్	వెయిటింగ్	అల్లూరి సీతారామరాజు ఎస్‌పి
9 తుషార్ డూడి	గుంటూరు ఎస్‌పి	బాపట్ల ఎస్‌పి
10 తుహీన్ సిన్హా	అల్లూరి సీతారామరాజు ఎస్‌పి	విశాఖ డిసిపి 2
11 డి నరసింహకిశోర్	టిటిడి విజిలెన్స్	తూర్పు గోదావరి ఎస్‌పి
12 వి విద్యాసాగర్ నాయుడు	గ్రేహ్యాండ్స్ కమాండర్	అన్నమయ్య ఎస్‌పి
13 బి కృష్ణారావు	అన్నమయ్య ఎస్‌పి	కోనసీమ ఎస్‌పి
14 ఆర్ గంగాధరరావు	సిఐడి ఎస్‌పి	కృష్ణ ఎస్‌పి
15 అజితా వేజేండ్ల	పశ్చిమ గోదావరి ఎస్‌పి	విశాఖ డిసిపి1
16 అద్నాన్ నయీమ్ హష్మీ	కృష్ణా ఎస్‌పి	పశ్చిమ గోదావరి ఎస్‌పి
17 కె ప్రతాప్ శివకిశోర్	చింతపల్లి ఎఎస్‌పి	ఏలూరు ఎస్‌పి
18 డి మేరి ప్రశాంతి	ఏలూరు ఎస్‌పి	రిపోర్ట్ టు డిజిపి ఆఫీస్
19 కె శ్రీనివాసరావు	ఎన్‌టిఆర్ పోలీస్‌కమిషనరేట్ డిసిపి	పల్నాడు ఎస్‌పి
20 మల్లికా గార్గ్	పల్నాడు ఎస్‌పి	విజయనగరం బెటాలియన్
21 ఎఆర్ దామోదర్	ఒంగోలు పిటిసి	ప్రకాశం ఎస్‌పి
22 జిఎస్ సునీల్	ప్రకాశం ఎస్‌పి	రిపోర్ట్ టు డిజిపి ఆఫీస్
23 జి బిందు మాదవ్	వెయిటింగ్	కర్నూలు ఎస్‌పి
24 జి కృష్ణకాంత్	కర్నూలు ఎస్‌ఎ	నెల్లూరు ఎస్‌పి
25 హరీఫ్ హఫీజ్	నెల్లూరు ఎస్‌పి	రిపోర్ట్ టు డిజిపి ఆఫీస్
26 అధిరాజ్ సింగ్ రాణా	ఎన్‌టిఆర్ డిసిపి	నంద్యాల ఎస్‌పి
27 వి హర్షవర్ధన్‌రాజు	తిరుపతి ఎస్‌ఎ	కడప ఎస్‌పి
28 కెవి మురళీకృష్ణ	అనకాపల్లి ఎస్‌పి	అనంతపురం ఎస్‌పి
29 గౌతమి షాలి	అనంతపురం ఎస్‌పి	ఎన్‌టిఆర్ డిసిపి
30 ఎల్ సుబ్బరాయుడు	డిప్యూటేషన్	తిరుపతి ఎస్‌పి, ఎర్రచందనం టిఎఫ్
31 వి గీతాదేవి	అనంతపురం పిటిసి	ఇంటలిజెన్స్ ఎస్‌పి
32 జిఆర్ రాధిక	రంపచోడవరం	ఓఎస్‌డి డిజిపిఓలో రిపోర్ట్
33 కె రఘువీరారెడ్డి	నంద్యాల ఎస్‌పి	డిజిపిఓలో రిపోర్ట్
34 సిద్ధార్థ కౌశల్	కడప ఎస్‌పి	డిజిపిఓలో రిపోర్ట్
35 పి జగదీష్	తూర్పు గోదావరి ఎస్‌పి	డిజిపిఓలో రిపోర్ట్
36 ఎస్ శ్రీధర్	కోనసీమ ఎస్‌పి	డిజిపిఓలో రిపోర్ట్
37 ఎం సత్తిబాబు	ఎస్‌సి ఎస్‌పి	డిజిపిఓలో రిపోర్ట్

ఆ క్వారీ నాది కాదు : బుగ్గన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లాలోని ప్యాపిలి మండలం పోదెడ్డిలో నడుస్తున్న కంకర క్వారీ తనది కాదని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడికక్కడ దాడులకు పాల్పడుతున్నారని, ఈ నెల 12న క్వారీలో కూడా దాడులకు పాల్పడటంతో స్థానికంగా ఉద్రిక్తతలు సృష్టించారని ఆయన విమర్శించారు. ఈ ఘటన నేపథ్యంలో తనపై తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. క్వారీ సక్రమమా? లేదా అక్రమమా? అని తేల్చాల్సింది ప్రభుత్వమని, టిడిపి నేతలు కాదని తెలిపారు. హింసాత్మక వాతావరణాన్ని సృష్టించి భయపెట్టాలని చూస్తే ప్రజలు సహించరని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 'రెడ్ బుక్' అరాచక పాలన

- మాజీ మంత్రి అంబటి ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్' పేరిట అరాచక పాలన చేస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న హింసకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదనే అంశాన్ని టిడిపి నాయకులు తెలుసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వేధించేందుకే అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా రాష్ట్రంలో భూ అక్రమాలకు కేరాఫ్ చంద్రబాబునాయుడేనని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆరోపించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. వారంతపు సెలవులు కావడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు యాత్రికులతో నిండిపోయాయి. నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగు రోడ్డు మీదుగా అక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల వరకు క్యూలైన్లు బారులు దీరాయి. ఈ రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశం ఉంది. శుక్రవారం శ్రీవారిని 65,392 మంది యాత్రికులు దర్శించుకున్నారు. 29,015 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు వెల్లడించారు.

16 న విఐపి దర్శనాలు రద్దు

ఈ నెల 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం.. సాయంత్రం పుష్పపల్లకిలో మలయప్పస్వామి ఊరేగింపు ఉండటంతో ఆ రోజు విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 15న సిఫార్సు లేఖల స్వీకరణను రద్దు చేసింది.

గుండమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న దళిత ప్రజా సంఘాల నాయకులు

నిందితులను అరెస్టు చేయకపోతే ఉద్యమం

- దళిత ప్రజా సంఘాల హెచ్చరిక
- ముగిసిన గుండమ్మ అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆదోని (కర్నూలు)

దళిత మహిళా గుండమ్మ హత్యకు కారకులైన నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే ఉద్యమం చేపడతామని దళిత ప్రజాసంఘాలు హెచ్చరించాయి. అవసరమైతే గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఉద్యమాన్ని తీసుకువెళ్తామన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథనహళ్లిలో నిర్వహించిన గుండమ్మ అంత్యక్రియల్లో కెవిపిఎస్, జైభీమ్‌ఎంఆర్‌పిఎస్, ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప, మండల నాయకులు వీరేష్ మాట్లాడుతూ... దళిత, గిరిజనుల హత్యలకు అడ్డుకట్ట వేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. బాధిత కుటుంబానికి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.50 లక్షలు, ఐదు ఎకరాల పొలం, ఐదు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు. ఈ ఘటనపై తక్షణమే కర్నూలు కలెక్టర్, ఎస్‌పి స్పందించాలని కోరారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు సుభాష్‌చంద్ర మాదిగ, గిడ్డయ్యాయ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

గుండమ్మ కేసులో ముగ్గురు నిందితులు రాఘవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుబ్బారెడ్డిని అదుపులోకి తీసుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి త్వరలోనే అరెస్ట్ చూపుతామన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించామని ఆదోని తాలూకా సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

అల్ట్రాటెక్‌లో మరో ప్రమాదం

- 15 అడుగుల పైనుండి పడిన కోల్ బిన్
- వ్యాపించిన మంటలు, కమ్ముకున్న పొగలు
- భయాందోళనకు గురైన గ్రామస్తులు, కార్మికులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలో శనివారం మరో ప్రమాదం జరిగింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఫ్యాక్టరీలోని సిమెంట్ తయారీకి బొగ్గును పొడిగా చేసి ఉపయోగిస్తారు. ఈ నెల 7న ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి ముగ్గురు మరణించారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ షడౌన్లో ఉండటంతో కోల్ బిన్‌లో బొగ్గు పేరుకుపోయింది. అది ఒక్కసారిగా 15 అడుగులపై నుండి కింద పడటంతో మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో బూదవాడ గ్రామస్తులు, కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. జగ్గయ్యపేట తహశీల్దారు శేషగిరిరావు, డిప్యూటీ తహశీల్దారు నాగరాజు మంటలను అదుపుచేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శేషగిరిరావు మాట్లాడుతూ వారం రోజులుగా ఫ్యాక్టరీ మూతపడి ఉండడంతో కోల్ బిన్‌లో పేరుకుపోయిన బొగ్గు పొడి అధిక వేడితో ఒక్కసారిగా కింద పడిందన్నారు. మంటలు వ్యాపించి పొగలు కమ్మేశాయని, అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది మంటలను, పొగను అదుపు చేశారని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ సంభవించలేదని చెప్పారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతోనే ఇప్పటి వరకూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటూ వచ్చామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, డిసిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1248వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎంఎం, ఎస్‌బిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి విశాఖలో పర్యటించినప్పటి నుంచి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ఆశలు చిగురించాయని తెలిపారు. ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేస్తామన్న ప్రకటన వచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంటును పూర్తిస్థాయి ఉత్పత్తితో నడపాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న వికలాంగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన 'ఉక్కు రక్షణకు మేము సైతం' పేరిట ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

న్యాయవ్యవస్థను అవమానపరిచిన బిజెపి : హేమంత్‌సోరెన్

న్యూఢిల్లీ : ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు శుక్రవారం లిక్కర్ స్కామ్‌లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసినప్పటికీ ఇదే కేసులో ఆయనకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు సిబిఐ కస్టడీని పొడిగించింది. ఈ పరిణామాలపై జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ మండిపడ్డారు. బిజెపి న్యాయవ్యవస్థను అవమానపరిచిందని ఆరోపించారు. శనివారం ఢిల్లీలోని జనపథ్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ నివాసంలో జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ ఆమెను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'నేను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సోనియాగాంధీని కలవలేదు. అందుకే ఆమెను కలవడానికి వచ్చాను. జరగబోయే జార్ఖండ్ ఎన్నికలపై చర్చలు కొనసాగుతున్నాయి. భారతీయులు చాలా సహనశీలురు. వారు దేనికైనా సహకరిస్తారు. దేన్నయినా సహిస్తారు. సహించలేకపోతే ఓటు ద్వారా తమ వాణిని వినిపిస్తారు. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో బిజెపి న్యాయవ్యవస్థను కించపరిచింది. కేజ్రీవాల్‌కు త్వరలో బెయిల్ మంజూరవుతుందని ఆశిస్తున్నాను.' అని అన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ చేతికి ఎంటిఎన్‌ఎల్ కార్యకలాపాలు..!

- ఇరు సంస్థల విలీనంపై వెనుకడుగు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెల్కోలు బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్‌ల విలీన ప్రతిపాదనపై కేంద్రం వెనక్కి తగ్గిందని సమాచారం. ఎంటిఎన్‌ఎల్‌కు ఉన్న భారీ అప్పులే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా.. ప్రస్తుతానికి విలీన అంశాన్ని పక్కనపెట్టి ఎంటిఎన్‌ఎల్ కార్యకలాపాలను బిఎస్‌ఎన్‌ఎల్‌కు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం కీలకంగా పరిశీలిస్తోందని వెల్లడించాయి. ఈ ప్రతిపాదనను తొలుత సెక్రటరీల కమిటీ ముందు ఉంచి ఆ తర్వాత కేబినెట్ ఆమోదానికి పంపించనున్నారు. అయితే దీనికి ఒక నెల రోజుల సమయం పట్టొచ్చని సమాచారం. అప్పుల్లో ఉన్న ఎంటిఎన్‌ఎల్‌ను బిఎస్‌ఎన్‌ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సరైందని కాదని కేంద్రం భావిస్తోంది.

ఎంటిఎన్‌ఎల్ ప్రస్తుతం ఢిల్లీ, ముంబయి నగరాల్లో మాత్రమే కార్యకలాపాలు కలిగి ఉంది. ఈ రెండు నగరాలు మినహా దేశమంతటా బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందిస్తుంది. ఈ ఏడాది జులై 20కి బాండ్ హోల్డర్లకు చెల్లించాల్సిన వడ్డీ చెల్లింపులకూ నిధుల కొరతను ఎదుర్కొంటుంది. 2023 ముగింపు నాటికి 46 లక్షల మంది వినియోగదారులుండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 41 లక్షలకు తగ్గింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎంటిఎన్‌ఎల్ రూ.3,303 కోట్ల నష్టాలు చవి

చూసింది. ఇంతక్రితం ఏడాది రూ.2,911 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.862 కోట్లుగా ఉండగా.. 2023-24లో నష్టాలు 15 శాతం తగ్గి రూ.728 కోట్లుగా నమోదయ్యాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఎంటిఎన్‌ఎల్ రూ.25,795 కోట్లుగా ఉన్నాయి.

రాబర్ట్ రవికి బిఎస్‌ఎన్‌ఎల్ బాధ్యతలు..!

బిఎస్‌ఎన్‌ఎల్ ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పికె పుర్వర్ పదవీ కాలం పెంపునకు డిపార్టుమెంట్ ఆఫ్ టెలికం (డిఒటి) శాఖ నిరాకరించింది. డిఒటి సీనియర్ టెలికం ఆఫీసర్ డిడిజి రాబర్ట్ జె రవికి అదనపు బాధ్యతలు అప్పగించనున్నారని సమాచారం. పుర్వర్ 2019లో సిఎండి బాధ్యతలను స్వీకరించారు. పదవీకాలం కోసం ఆయన పెట్టుకున్న దరఖాస్తును డిఒటి పక్కన పెట్టిందని తెలుస్తోంది. టెలికం సర్వీసు ఆఫీసర్‌గా రవికి 34 ఏళ్ల విశేష అనుభవం ఉంది. డిఒటి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. బిఎస్‌ఎన్‌ఎల్‌లోనూ ఆరేళ్ల పాటు ఆడిషనల్ జనరల్ మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

బిఎస్‌ఎన్‌ఎల్ రూ.107 చౌక ప్లాన్

ప్రయివేటు టెల్కోలు ఇటీవల భారీగా టారీఫ్‌లను పెంచిన వేళ బిఎస్‌ఎన్‌ఎల్ మాత్రం తన వినియోగదారులపై భారం మోపకుండా చౌక ప్లాన్లను ఆఫర్ చేస్తోంది. 35 రోజుల గడువుతో రూ.107కే రీచార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ కింద 200 నిమిషాలు ఏ నెట్‌వర్క్‌కైనా మాట్లాడుకోవడానికి వీలుంది. అదే విధంగా 3జిబి ఉచిత డాటాను అందిస్తుంది. ఇటీవల ప్రయివేటు టెల్కోలు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తమ టారీఫ్‌లను 25 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. కాగా.. జియో 28 రోజుల కాలపరిమితి ప్లాన్‌కు కనీసం టారీఫ్‌ను రూ.189గా నిర్ణయించింది. ఇందులో అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, 2బిజి డాటాను అందిస్తుంది. ఎయిర్‌టెల్ బేసిక్ ప్లాన్ రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్ 28 రోజుల గడువుతో ఉంది. వొడాఫోన్ ఐడియా 28 రోజుల కాలపరిమితితో రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తుంది. వీటితో పోల్చితే బిఎస్‌ఎన్‌ఎల్ చౌక ప్లాన్‌గా వినియోగదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన నగరాల్లో 4జి సేవలు అందిస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్ ఆగస్ట్ చివరి నాటికి దేశ వ్యాప్తంగా విస్తరించాలని నిర్దేశించుకుంది.

లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాల పెంపునకు కేంద్రం యత్నం

- జమ్ము-కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో నియమాలను సవరించిన హోంమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ : జమ్ము- కాశ్మీర్ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాల్ని పెంచేలా చర్యలు చేపట్టింది. జమ్ము - కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 నియమాలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ సవరించింది. జమ్ము కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019లో అధికారాలను అమలు చేసే సెక్షన్ 55 నిబంధనలో సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్) నోటిఫికేషన్ పేర్కొంది. జమ్ముకాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ వ్యాపార లావాదేవీలను సవరించడానికి రాష్ట్రపతి మరిన్ని నిబంధనలను రూపొందించినట్లు ఈ నోటిఫికేషన్ పేర్కొంది. తాజాగా సవరించిన చట్టాన్ని జమ్ము కాశ్మీర్ (రెండవ సవరణ)- నియమాలు 2024 అని పిలవాలని ఎంహెచ్ నోటిఫికేషన్ తెలిపింది. ఈ సవరించిన నిబంధనల ద్వారా శాంతి భద్రతల చర్యలకు సంబంధించి పూర్తి అధికారాలు లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లోనే ఉంటాయి. అంతకుముందు పోలీసు, పబ్లిక్ ఆర్డర్, ఆల్ ఇండియా సర్వీస్, అవినీతి నిరోధక బ్యూరోకు సంబంధించి విచక్షణను అమలు చేయడానికి ఆర్థిక శాఖ సమ్మతి అవసరం ఉండేది. కొత్తగా సవరించిన చట్ట నియమాల్లో చొప్పించిన సబ్ రూల్ (2ఎ) ప్రకారం.. ఆర్థికశాఖ సమ్మతి అవసరం లేదు. పోలీసు, యాంటీ కరప్షన్ బ్యూరో, ఆలిండియా సర్వీసులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ గవర్నర్ ముందుంచితే.. ఆయన ఆ ప్రతిపాదనలను అంగీకరించొచ్చు లేదా వాటిని తిరస్కరించే అవకాశం ఉంది. చట్టంలోని ప్రధాన నియమాల్లో 42 తర్వాత.. కొత్తగా 42(ఎ)ను హోం మంత్రిత్వశాఖ చేర్చింది. ఈ నిబంధన ప్రకారం.. ముఖ్యమంత్రికి న్యాయ వ్యవహారాల్లో ఎలాంటి అధికారం ఉండదు. అడ్వకేట్ జనరల్‌తోపాటు ఇతర న్యాయ అధికారుల నియమకానికి ప్రధాన కార్యదర్శితోపాటు ముఖ్యమంత్రి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం పంపాలి. ఇక 42బి నియమం ప్రకారం.. ప్రాసిక్యూషన్ మంజూరు లేదా అప్పీల్‌కు దాఖలకు సంబంధించిన ఏదైనా ప్రతిపాదనను న్యాయశాఖ, జస్టిస్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ద్వారా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచుతారు. 43 నిబంధన కూడా జైళ్లు, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి సంబంధించిన విషయాలపై కొన్ని నిబంధనలు చేర్చడం జరుగుతుందని ఎంహెచ్ఎ నోటిఫికేషన్ పేర్కొంది. అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్ క్యాడర్ పోస్టుల పోస్టింగ్ బదీలలకి సంబంధించిన విషయాలకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్‌కు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి ద్వారా ప్రతిపాదనను పంపాలి.

సమస్యల పరిష్కారానికి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించాలని తెలిపారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని, సమర్థులందరికీ అవకాశం ఉంటుందన్నారు. ప్రతిపక్షంలో కష్టపడ్డవారికి పదవులు దక్కుతాయని, వీరికోసం ఐదు విధాలుగా సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షంపై ఏవరూ కక్షసాధింపు చర్యలకు పాల్పడొద్దని సూచించారు. ఇలాంటి చర్యలు పాల్పడటంతోనే వైసిపి 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందన్నారు.కక్షసాధింపులకు దిగితే మనల్ని కూడా ప్రజలు 164 సీట్ల నుంచి 4 సీట్లకు తీసుకొస్తారని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టిన అధికారులపై చట్టప్రకారమే చర్యలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే నమోదు చేసిన అక్రమ కేసుల నుంచి చట్టబద్ధంగానే విముక్తి కల్పించేదిశగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. తమ పరిధిలో నమోదైన కేసుల వివరాలను నియోజకవర్గ ఇన్‌చార్జులు పార్టీకి అందించాలని ఆదేశించారు. అన్ని రంగాల్లో ప్రజలకు మంచి పరిపాలన అందించాలని చెప్పారు. అవినీతి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవ్, సీనియర్ నాయకులు టిడి జనార్ధన్, వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు అశోక్ బాబు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి రెడ్డి సుబ్రహ్మణ్యం, దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాప వైద్యానికి 16కోట్లు సాయం కోరిన బాధితులు

గుంటూరుకు చెందిన వెచ్చా ప్రీతమ్ దంపతులు తమ పాప హితైషీను తీసుకొచ్చి చంద్రబాబును కలిశారు. హితైషీ తీవ్రమైన వ్యాధితో బాధపడుతోందని, చికిత్సం కోసం జోల్గెన్స్‌మ ఇంజక్షన్ ఇవ్వాలిలని వివరించారు. దీని ధర రూ.16కోట్లు అని, మరో నెల లోపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అంశంపై వెంటనే పరిశీలన చేస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. తమను విధుల్లోకి తీసుకోవాలని బీమా మిత్రలు సిఎంకు వినతిపత్రం అందించారు. విజయవాడకు చెందిన షేక్ ఆసిన్ మహ్మద్ ఇంతియాజ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం సిఎంకు లక్ష విరాళంగా అందించారు.

కాళ్లకు దండం పెట్టొద్దు: చంద్రబాబు

ప్రజలు, పార్టీకార్యకర్తలు, నేతలు తన కాళ్లకు నమస్కారం చేసే పని చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆత్మగౌరవంతో నడుచుకోవాలని, ఈ సంస్కృతి మంచిది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎవరైనా తన కాళ్లకు మొక్కితే తిరిగి తాను కూడా వాళ్ల కాళ్లకు మొక్కుతానని చెప్పారు. ఎంత వారిస్తున్నా ఇలా చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులకు మాత్రమే మొక్కాలని నాయకులదని కాదన్నారు. తన సూచనను, విజ్ఞప్తిని అందరూ చేసుకొని సహకరించాలని కోరారు.

గుడ్‌నైట్ లిక్విడ్ వేపరైజర్‌కు పేటెంట్

న్యూఢిల్లీ : దోమలతో వ్యాపించే వ్యాధులపై పోరాటంలో శాస్త్రీయంగా మరో మైలురాయిని సాధించినట్లు గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జిసిపిఎల్) తెలిపింది. తమ భాగస్వామితో కలిసి తమ శాస్త్రవేత్తలు 'రెనోఫ్లూత్రిన్' అభివృద్ధి చేశారని తెలిపింది. ఇది భారత్‌లోనే తొలిసారిగా అభివద్ధి చేసిన స్వదేశీ పేటెంట్ మాలిక్యూల్ అని పేర్కొంది. ప్రస్తుత ఉత్పత్తుల కంటే నూతన రెనోఫ్లూత్రిన్‌తో తయారు చేసిన ఫార్ములేషన్‌లు దోమలపై రెండు రెట్లు ఎక్కువ ప్రభావవంతంగా పని చేస్తాయని వెల్లడించింది. ఈ గుడ్‌నైట్ ఫ్లాష్ పూర్తి ప్యాక్ ధరను రూ.100గా నిర్ణయించింది.

డిమార్ట్ లాభాల్లో 17.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ రిటైల్ చెయిన్ డిమార్ట్‌కు చెందిన మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ నికర లాభాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 17.45 శాతం వృద్ధితో రూ.773.68 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.658.71 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.11,865 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ1లో 18.57 శాతం పెరిగి 14,069 కోట్లుగా నమోదయ్యాయి.

ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' : నిమ్మల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి పెద్దఎత్తున వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఇసుక, పెన్షన్ తదితర అంశాలపైన వైసిపి విషప్రచారం చేస్తోందన్నారు. 'అమ్మఒడి' సొమ్ములో కోతలు విధించిన వైసిపికి, ఆ పార్టీ నాయకులకు 'తల్లికి వందనం' గురించే మాట్లాడే అర్హత లేదన్నారు. గత ఐదేళ్లు ప్రజలను మోసగించినందునే మూడంకెల సీట్ల నుంచి రెండంకెల సీట్లకు వైసిపిని పరిమితం చేశారని తెలిపారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోకపోతే సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతారని తెలిపారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, నేతలతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం ఫలితాలు సాధించి జాతీయస్థాయిలో చర్చించుకునే స్థాయిలో ఘన విజయం సాధించడానికి సమిష్టి కృషి కారణమన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లగలిగామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది వాలంటీర్లకు సభ్యత్వ నమోదు లాగిన్ ఐడి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి హరిప్రసాద్, కోశాధికారి ఎవి రత్నం, ఐటి విభాగ ఛైర్మన్ మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి- రామచంద్రాపురం (తిరుపతి జిల్లా)

తిరుపతిలో ఓ మహిళ దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని దుండగలు గొంతుకోసి చంపాడు. ఈ దారుణ సంఘటన తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు... తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్‌లో రామిరెడ్డి దంపతులు నివసిస్తున్నారు. భార్య రెడ్డమ్మ (59) అంధురాలైన కుమార్తెతో కలిసి జీవిస్తున్నారు. రామిరెడ్డి వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి రెడ్డమ్మ ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి గొంతుకోసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను, సిసి టీవీ పుటేజులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. దొంగలే హత్య చేశారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'జిపిఎస్' గెజిట్‌ను రద్దు చేయండి

- పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి
- సిపిఎం విస్తృత సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిపిఎస్ అమలు కోసం జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఎం విస్తృత సమావేశం తీర్మానించింది. రెండు రోజుల పాటు వడ్డేశ్వరంలో జరిగిన విస్తృత సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. . సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ని అమలు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించిందని, ఈ జిపిఎస్ విధానాన్ని అంగీకరించబోమని ఉద్యోగ ఉపాధ్యాయులు ముక్తకంఠంతో వ్యతిరేకించి నిరసనలు, పోరాటాలు చేశాయని తీర్మానంలో పేర్కొన్నారు. ఎన్నికల ముందే తయారు చేసిన గెజిట్‌ని జూలై 12, 2024న విడుదల చేయడంలో మర్మమేమిటన్నది ఇప్పటి ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. సిపిఎస్, జిపిఎస్‌లు పాత పెన్షన్‌కి సాటిరావని, ఈ స్కీమ్‌లు కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీలకు మాత్రమే లాభమని, ఉద్యోగులు పోరాటాల ద్వారా సాధించుకున్న సామాజిక భద్రత ఇచ్చే పాత పెన్షన్ రద్దు చేసి, కార్పొరేట్లకు లాభాలను చేకూర్చే జిపిఎస్ విధానం తీసుకురావడం సరికాదని తీర్మానంలో పేర్కొన్నారు. ఉద్యోగుల జీతం నుండి 10 శాతం కంట్రిబ్యూషన్ కట్టించుకొనే ఏ స్కీమ్ అయినా రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకమని తెలిపారు. 2023 అక్టోబర్ నుంచే జిపిఎస్ అమలు చేస్తామని పాత డేట్‌తో ఇప్పుడు గెజిట్‌ను విడుదల చేయడం ఉద్యోగులను మోసం చేయడమేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం జిపిఎస్ కోసం విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్ రద్దుకోసం, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే పోరాటాలకు సంపూర్ణ మద్దతు తెలపడంతోపాటు, ప్రత్యక్షంగా పోరాటాల్లో పాల్గొంటామని తీర్మానంలో సిపిఎం పేర్కొంది. ఈ తీర్మానాన్ని ఎన్‌విరావు ప్రవేశపెట్టారు.

సిపిఎం విస్తృత సమావేశంలో ఎంఎ బేబీ, బివి రాఘవులు, వి శ్రీనివాసరావు, గఫూర్ తదితరులు

అసభ్య వీడియోలు, చిత్రాలను నియంత్రించాలి

అసభ్య వీడియోలు, చిత్రాలను సోషల్ మీడియాలో నియంత్రించాలని, యూట్యూబ్ ట్రోలర్స్‌పై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రజలను ప్రభావితం చేసే సాధనంగా సోషల్ మీడియా ముందుకు వచ్చిందని, చదువు, వయస్సు లింగ బేధం లేకుండా సోషల్ మీడియాను వినియోగించే వారి సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగిందని పేర్కొన్నారు. సోషల్ మీడియాను మహిళలను కించపరుస్తూ సమాజంలో ఉన్న ఆధిపత్య భావజాలాన్ని, హిందూత్వ భావజాలాన్ని మహిళలపట్ల ప్రదర్శిస్తూ ట్రోల్ చేయడం ఈ కాలంలో పెరిగిందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మహిళలను ట్రోల్ చేసే వీడియోలు, చిత్రాలను నియంత్రించాలని, వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాడ్ చేస్తూ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని ఆషాదీప్తి ప్రతిపాదించారు.

మద్యాన్ని, మత్తు పదార్థాలను అరికట్టాలి

రాష్ట్రంలో మద్యాన్ని, మత్తు పదార్థాలను అరికట్టాలని మరో తీర్మానంలో సిపిఎం డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మద్యాన్ని నిషేధిస్తామని చెప్పిందని, కోవిడ్‌లో షాపులను తిరిగి తెరిచిన తరువాత మద్యం పెంచుకునే విధంగా ప్రభుత్వ విధానాలు అమ్మకాలు సాగాయని పేర్కొంది. జీవితాలను నాశనం చేసే మద్యాన్ని అరికట్టి ప్రభుత్వం మద్యం షాపులను తగ్గించాలని, గంజాయి మత్తు మందులను, స్కూళ్లు, కాలేజీల్లో కూడా చిన్న పిల్లలకు అలవాటు చేస్తున్నారని తెలిపారు. మద్యం, మత్తుమందుల ప్రభావంతో పసిబిడ్డలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని, కుటుంబాలను, జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలను, మద్యాన్ని అరికట్టాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని పి.పూర్ణ ప్రతిపాదించారు.

'సూపర్ 6' ఇతర హామీల అమలుకు చర్యలు చేపట్టాలి

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్, ఇతర హామీల అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలని విస్తృత సమావేశం తీర్మానించింది. సూపర్ సిక్స్ తో సహా ప్రకటించిన ఉమ్మడి ప్రణాళిక హామీలు, ఇతర కారణాలతో ఎన్నికల్లో ప్రజలు పెద్ద మెజారిటీతో గెలిపించారని, సూపర్ సిక్స్ ఇతర హామీల అమలు కోసం ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని నాగరాజు ప్రవేశపెట్టారు.

దళిత మహిళ హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేయండి

- డిజిపికి కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథన హళ్లి గ్రామంలో దళిత మహిళ బసివి గుండమ్మను అత్యంత కిరాతకంగా ట్రాక్టర్‌తో గుద్ది చంపిన పెత్తందారులు శ్రీధర్ రెడ్డి, సోమప్ప, సుబ్బారెడ్డి, నాగరాజు, లక్ష్మన్నలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు శనివారం కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఓ నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రిలు రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రాన్ని అందించారు. గ్రామంలోని అగ్రకులానికి చెందిన రాగప్ప భూమిని గుండమ్మ కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకుని సాగు చేసుకుంటోందని తెలిపారు. ఆధిపత్య కులాల భూమిని దళితులు కొంటే అంతు చూస్తామని, చంపినా తమని ఏమి చెయ్యలేరనే కులదురహంకారంతో రాగప్ప కుమారుడు శ్రీధర్ రెడ్డి అనుచరులు సోమప్ప, సుబ్బారెడ్డి, నాగరాజు, లక్ష్మన్నలతో కలిసి గుండమ్మను తను కొన్న భూమిలో ఉండగానే ట్రాక్టర్‌తో గుద్ది చంపారని వివరించారు.

గుండమ్మకు అండగా ఉన్న పురుషోత్తం రెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేశారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'మీ సేవ' కేంద్రాల పునరుద్ధరణకు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పట్టణాల్లోని 'మీ సేవ' కేంద్రాలను పునరుద్ధరించాలని కాంట్రాక్టు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఇ-సేవ (మీ సేవ) కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో 170 అర్బన్ ఇ-(మీ) సేవ కేంద్రాలను మూసివేశారని తెలిపారు. వాటిన్నంటిని పునరుద్ధరించి, వాటిల్లో 18 ఏళ్లుగా విధులు నిర్వహించిన ఉద్యోగులను తిరిగి కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 600 సర్వీసులు అందిస్తున్నందున యూజర్ చార్జీల రూపంలో వచ్చే ఆదాయంతోనే ఉద్యోగులకు వేతనాలు ఇవ్వొచ్చని, ప్రభుత్వంపై అదనపు భారం పడదని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తమకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎమ్‌వి సుధాకర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం బాబూరావు పాల్గొన్నారు.

ఎపిసిఎన్‌ఎఫ్‌కు జర్మనీ పురస్కారం పట్ల చంద్రబాబు, అచ్చెన్నాయుడు హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఎపిసిఎన్‌ఎఫ్) సంస్థ 2024 సంవత్సరానికి గాను జర్మనీ ప్రతిష్టాత్మక పురస్కారం 'గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యుమానిటీ' దక్కించుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపిసిఎన్‌ఎఫ్ ప్రతినిధి నాగేంద్రమ్మను అభినందించారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయ విధానానికి చేరువ చేయాలని సంకల్పించినట్లు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దేశంలోనే గుల్బెంకియన్ పురస్కారాన్ని అందుకున్న తొలి సంస్థగా ఎపిసిఎన్‌ఎఫ్ నిలవడం గర్వకారణమన్నారు. ఎపిసిఎన్‌ఎఫ్ తరపున 10 లక్షల మంది రైతుల ప్రతినిధిగా నాగేంద్రమ్మ ఈ అవార్డు అందుకోవడం మహిళా సాధికారతను తెలియజేస్తోందన్నారు. గుల్బెంకియన్ పురస్కారం కింద లభించిన దాదాపు రూ.3 కోట్లను ప్రకృతి వ్యవసాయ విస్తరణకు వినియోగిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి రాయితీ పథకం

పశువులు, కోళ్ల పెంపకందారులకు ప్రోత్సాహకంలో భాగంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్లు నిర్మించుకునేందుకు రాయితీ పథకం అమల్జేయనున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ పథకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పశువుల షెడ్లకు ఒక్కో యూనిట్‌కు 90 శాతం (గరిష్టంగా రూ.2.3 లక్షలు), లక్షలు, గొర్రెలు, మేకల షెడ్లకు 70 శాతం (గరిష్టంగా రూ.2.3 లక్షలు), కోళ్ల షెడ్లకు 70 శాతం (గరిష్టంగా రూ.1.32 లక్షలు) చొప్పున రాయితీ లభిస్తుందని తెలిపారు.

అక్షయపాత్రకు అన్న క్యాంటీన్లు

- సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని గోకుల క్షేత్రం శ్రీవెంకటేశ్వర ఆలయంలో అనంత శేష స్థాపన కార్యక్రమంలో శనివారం సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లకు భోజన సరఫరా కూడా గతంలో అక్షయపాత్రకే అప్పగించామని తెలిపారు. భోజన నాణ్యతలో ఒక్క ఫిర్యాదూ లేకుండా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేశారన్నారు. సమాజంలో మంచి చేసే వారికి స్పీడ్ బ్రేకర్లు ఉండవని, వారికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, మంత్రులు ఎస్ సవిత, పి నారాయణ, నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

నైట్రేట్ వల్లే పిడుగురాళ్లలో డయేరియా

- మురుగు కాల్వలను శుభ్రం చేసిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో డయేరియా ప్రబలడానికి బోరు నీటిలో నైట్రేట్ ఉండటమే కారణమని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో లెనిన్‌నగర్, శాంతినగర్‌లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి డయేరియాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాల్వలలో పూడిక తొలగించేందుకు తక్షణ సాయంగా రూ.10 లక్షలు మంజూరు చేశారు. నైట్రేట్ నమూనాలు గుర్తించిన 8 బోర్ల నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. స్థానికంగా ఉన్న మరో 36 మంచి నీటి బోర్ల నీటిని పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షా కాలంలో పైపుల లీకేజీ వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలందరూ కాచి వడగట్టిన నీటినే తాగాలని సూచించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ డయేరియా వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని మంచినీళ్ల ట్యాంకు శుభ్రం చేసి చాలా కాలమైందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలలో పర్యటించి గడిచిన మూడు రోజుల వ్యవధిలో డ్రెయినేజీలపై అధికారులు చేసిన పనులు పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా మంత్రి డ్రెయినేజీలో పూడికను తొలగించి పనితీరు మెరుగుపర్చుకోవాలని అధికారులకు సూచించారు.

బాలిక మృతదేహం కోసం సంగమేశ్వరం వద్ద గాలింపు

ప్రజాశక్తి-పగిడ్యాల

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో హత్యకు గురైన బాలిక మృతదేహం నేటికీ లభ్యం కాలేదు. ఐదు రోజులవుతున్న ఆచూకీ లభించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులైన ముగ్గురు బాలురు చెప్పిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కెసి కెనాల్, వనుములపాడు గ్రామ సమీపాన నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలను స్వయంగా ఎస్‌పి, జిల్లా కలెక్టర్ పర్యవేక్షించినా బాలిక మృతదేహం లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ముట్టడించారు. 'మా అమ్మాయి మృతదేహాన్ని మాకు అప్పజెప్పండి" అంటూ పోలీసులను కోరారు. ఈ నేపథ్యంలో నిందితులను పోలీసులు మరోసారి విచారించారు. సంగమేశ్వరం వద్ద మృతదేహాన్ని పడేశామని చెప్పడంతో పోలీసులు అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు.

మూడు బోట్లు, పాత ఎల్లాల సమీపాన మరో మూడు బోట్ల ద్వారా రెస్క్యూ టీమ్‌లు గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే ఎల్లాల గ్రామం పరిసరాల్లోనూ జల్లెడ పట్టాయి. త్వరలో మృతదేహాన్ని కనుగొంటామని పోలీసులు చెబుతున్నారు. నిందితుల కుటుంబసభ్యులను రెండు రోజులుగా పోలీసులు విచారిస్తున్నారు.

సంగమేశ్వరం వద్ద గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీములు

ప్రభుత్వ వైఫల్యమే : ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఐదురోజులైనా బాలిక మృతదేహం లభ్యం కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైసిపి కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. బాలిక కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. చిన్నారి హత్యపై హోం మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆమె మాటలకే పరిమితమయ్యారని, బాధిత కుటుంబసభ్యులను కనీసం పరామర్శించలేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

మామిడి తోటలో గంజాయి సాగు

ప్రజాశక్తి - రాయదుర్గం (అనంతపురం)

అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామ సమీపంలో ఓ మామిడి తోటలో పెంచుతున్న గంజాయి మొక్కలను సెబ్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గంలోని సెబ్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను సెబ్ అదనపు ఎస్‌పి జి.రామకృష్ణ శనివారం విలేకరులకు వెల్లడించారు. ఆయన వివరాల మేరకు..సెబ్ జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ వెంకటలక్ష్మికి అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఎఇఎస్ మంగు శ్రీరామ్, రాయదుర్గం సెబ్ సిఐ మురళీమోహన్, తన సిబ్బందితో కలిసి టి.వీరాపురం గ్రామంలోని మామిడి తోటలో తనిఖీలు చేశారు. మామిడి, నేరేడు చెట్ల నడుమ పెంచిన కనకాంబరం తోటలో అంతర్ పంటగా వేసిన గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ తోటలో పని చేస్తున్న చిలకర్రి వన్నూరు స్వామి వీటిని సాగు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నాలుగు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని వన్నూరు స్వామిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు 7.25 కిలోలు ఉండగా వీటి విలువ రూ.21 వేలు ఉంటుందని సెబ్ అదనపు ఎస్‌పి రామకృష్ణ తెలిపారు

స్థానికులకే 'ఏకలవ్య' ఉపాధ్యాయ పోస్టులు

- ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యా సంస్థ (ఇఎంఆర్ఐ)'ల్లో ఉపాధ్యాయులుగా స్థానికులనే నియమించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ), ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్షకార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఏ అశోక్, గిరిజన సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లోత రాంబాబు, కె సురేంద్ర వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశారు. రాష్ట్రంలో 28 ఏకలవ్య విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిల్లో సుమారు 15 వేల మంది ఆదివాసీ విద్యార్థులున్నారని తెలిపారు. వీటి ప్రారంభం నుంచి స్థానికులే బోధన సిబ్బందిగా ఉండేవారని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల నుంచి బోధన సిబ్బందిని నియమించిందని పేర్కొన్నారు. హిందీ మాధ్యమంలో బోధన జరుగుతుండటంతో పాఠాలు అర్థంకాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చదువు మానేసే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే ఏలూరు, పాడేరు, నెల్లూరు, గుమ్మలక్ష్మిపురం పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి, స్థానికులనే ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 20% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రత్యక్ష పన్ను వసూళ్లలో భారీ వృద్ధి చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కార్పొరేట్ల అధిక అడ్వాన్స్ చెల్లింపుల్లో పెరుగుదల ఉందని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) వర్గాలు తెలిపాయి. జులై 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో కార్పొరేట్ ఇన్‌కం టాక్స్ కింద రూ.2,10,274 కోట్లు, వ్యక్తిగత పన్ను చెల్లింపుల కింద రూ.3,46,036 కోట్లుగా సమకూరాయి. గతేడాది ఇదే కాలంలో రూ.4,80,458 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

ఆటోనగర్ బ్రాంచ్, విజయవాడ (4470)
పంటకాలువ రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2544770, 8331015770

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీమతి జొన్నలగడ్డ నాగలక్ష్మి మరియు శ్రీ జొన్నలగడ్డ ప్రసాద్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **రూ. 80,62,923.00 (అక్షరాల ఎనభై లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల ఇరవై మూడు రూపాయలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **02.05.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **11.07.2024 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత మరియు ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 30.06.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 81,84,389.00 (అక్షరాల ఎనభై ఒక్క లక్షల ఎనభై నాలుగు వేల మూడు వందల ఎనభై తొమ్మిది రూపాయలు)** + వడ్డీ మరియు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

విజయవాడ, పటమట ఎస్ఆర్ఒ, విఎమ్‌సి ఏరియా, పటమట, రెవిన్యూ వార్డు నెం.10, పాత అసెస్‌మెంట్ నెం. 1073152225, సమీప డి.నెం. 74-24-35/1A, ఆర్.ఎస్. నెం. 225/4 నందు 710.22 చ॥గ॥ స్థలంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 60 చ॥గ॥ వాటాతో "యాపిల్ గ్రాండ్" ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్, మూడవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1460 చ॥అ॥, ఉమ్మడి ఏరియా 350 చ॥అ॥, పార్కింగ్ ఏరియా 200 చ॥అ॥ గల ఫ్లాట్ నెం. 402. **మొత్తం ఆస్తికి హద్దులు:** తూర్పు: కాట్రగడ్డ గంగాధరరావు ఇతరులకు అమ్మినది, దక్షిణం: ఆనంద్ సాయి నిలయం అపార్ట్‌మెంట్ ఆస్తి, పడమర: 30.0 అ॥ వెడల్పు మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: త్రిపురనేని ధనుంజయరావు ఆస్తి.

పైన తెలిపిన మొత్తం స్థలంలో నిర్మించిన **"యాపిల్ గ్రాండ్" నందు మూడవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1460 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) కలిగిన ఫ్లాట్ నెం.402** అన్ని సౌకర్యాలతో. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: మెట్లు, ఉమ్మడి వరండా మరియు శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 11.07.2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/349/2019 **13.06.2024**

Canara Bank, Main Branch, Hindu College High School Campus, Guntur.
Versus
M/s Veda Narasimha Traders & others

To
(CD-1) M/s Veda Narasimha Traders, Rep. by its Prop. Sri. Damuluri Suryanarayana, D No. 10- 7-660, Lanchester Road, Sangadigunta, Guntur District.
(CD-2) Sri. Damuluri Suryanarayana, S/o Sri. Lakshmi Narasaiah, D No. 25-17-449, Srinivasapeta, 4th Lane, Guntur, Guntur District.
(CD-3) Smt. Damuluri Hemalatha, W/o Sri. Damuluri Suryanarayana, D No. 25-17-449, Srinivasapeta, 4th Lane, Guntur, Guntur District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/901/2017** an amount of **Rs. 2,00,86,692/- (Rupees two crore eighty six thousand six hundred and ninety two only) minus Rs. 10,75,000/- (realized by applicant bank as per PS Memo dated 14.06.2019)** along with pendentallite and future interest @ 10.09% p.a compounded with monthly rests from 17.10.2017 till realization / date of payment and the costs become due against you (Jointly and severally /Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **01.07.2024** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:

16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.

16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 13th June, 2024)

(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

O.A. No.452 OF 2024

Between :
M/s. HDFC Bank Ltd, Rep, by its Authorized Officer, Office at D.No.50-96-5, Plot No.175, Opp. Old SBH, Near NRI Hospital, Seethammadhara, Visakhapatnam ... APPLICANT
And
1) M/s Style N Style, (Retail Sale In Specialised Stores of Pharmaceutical and Medical Goods, Cosmetic And Toilet Articles; Textiles, Clothing, Footwear And Leather Goods Products) Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao, Door No 12-13/60, Main Road, Tarnaka, Hyderabad, Telangana, AP-500 007.
2) M/s Style N Style, Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao, Dr.No.37-1-58, Trunk Road, Ongole-523 001.
3) Mr. Perakam Venkata Subba Rao, S/o Mr. P. Chenchaiah, D.No. 12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
4) Mr. Pati Bandla Sreeramulu, S/o Mr. Pari Bandala Veera Swamy, D.No.12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
5) Mrs. Perakam Sree Lakshmi, W/o Mr. Perakam Venkata Subba Rao, D.No.12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
6) Mr. Idimukkala Srikrishna Prasad, S/o Gopalakrishnaiah, D.No. 48-1-35C, Marathipalem, Ward-14, Ongole, Andhra Pradesh-523 001.
7) Mr. Golla Prasad Babu, S/o Kuppuswamy, D.No.26-23-25, Gandhinagar, Vijayawada, Andhra Pradesh-520 003.
... DEFENDANTS

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS
NO. D1 to D.6 BY WAY OF PAPER PUBLICATION

D.1 M/s Style N Style, (Retail Sale In Specialised Stores of Pharmaceutical and Medical Goods, Cosmetic And Toilet Articles; Textiles, Clothing, Footwear And Leather Goods Products) Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao, Door No 12-13/60, Main Road, Tarnaka, Hyderabad, Telangana, AP-500 007.
D.2 Mr. Idimukkala Srikrishna Prasad, S/o Gopalakrishnaiah, D.No. 48-1-35C, Marathipalem, Ward-14, Ongole, Andhra Pradesh-523 001.
... DEFENDANTS

1. WHEREAS, the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m or at such time immediately thereafter according to the convenience of Tribunal on **02/08/2024.** You are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader / Advocate duly instructed.
4. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the 2nd day of July, 2024

Signature of the Officer
Authorized to Issue Summons

సంపాదకీయం

'నీలి' తుఫాను

మానసికోల్లాసం కలిగించేది హాస్యం. నవరసాల్లో హాస్యం ఒకటి. హాసం అంటే నవ్వు. ఆ నవ్వును పుట్టించేదే హాస్యం. ఈ ఆనందాన్వేషణే మనిషిని మిగిలిన జీవరాసుల నుంచి వేరు చేస్తుంది. 'నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును నవ్వులు చిత్త వృత్తికిన్/ దివ్వెలు కొన్ని నవ్వులెటు తేలవు, కొన్ని విష ప్రయుక్తముల్/ పువ్వుల వోలె ప్రేమరసముల్ వెలిగ్రక్కు, విశుద్ధమైన లే/ నవ్వులు సర్వదు:ఖ దమంబులు, వ్యాధులకున్ మహౌషధముల్' అంటూ నవ్వు గురించి ఎంతో సౌందర్యంగా చెప్తాడు జాషువా. జంతువుల నుండి మనిషిని వేరు చేసే నవ్వు... విషపూరితం కాకుండా పువ్వులా మృదువైన ప్రేమరసాన్ని అందించి దు:ఖాన్ని, రోగాన్ని ఉపశమింప చేయాలని కవి భావన. మహా రచయితల చెణుకుల్లోనూ అశ్లీలతకు తావులేని చక్కని హాస్యం పండుతుంది. "ఒకరోజు ఉదయాన్నే విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ ఇంటికి వెళ్ళారుట. ఆ సమయంలో బావి దగ్గర స్నానం చేస్తున్న శ్రీశ్రీని చూసి...'శ్రీశ్రీ గారు నీళ్ళోసుకుంటున్నారా?' అన్నారట విశ్వనాథ. దానికి శ్రీశ్రీ అంతే చమత్కారంగా 'విశ్వనాథ వారు కనుచున్నారా' అన్నారుట" ఇందులోని హాస్య చతురత ఎవరినైనా కడుపుబ్బా నవ్విస్తుంది. ఆమోదయోగ్యమైన హాస్యాన్ని ఆనందంగా అనుభవిస్తేనే ఆహ్లాదం, ఆరోగ్యం. అంతేగానీ ఎబ్బెట్టుగా, వెగటు పుట్టించేదిగా వుండకూడదు. హాస్యం పేరుతో, డార్క్ కామెడీ ముసుగులో యూట్యూబ్‌లో డంప్ అవుతోన్న టన్నుల కొద్దీ అశ్లీలత హాస్యం కానేకాదు.

ఇటీవల టీవీ షోల దగ్గర నుంచి సినిమాల వరకూ బాడీ షేమింగ్, వ్యక్తిత్వ హననం, ద్వంద్వార్థాలతో కూడిన అశ్లీల సంభాషణలు హాస్యం పేరుతో చెలామణీ అవుతున్నాయి. సమాజాన్ని భ్రష్టు పట్టించే, జుగుప్స కలిగించే అశ్లీల దృశ్యాలు, కథనాలు మనిషిలో హింసా ప్రవృత్తిని పెంచే నీలిమేఘాలు ఇప్పుడు యూట్యూబ్‌ను కమ్మేశాయి. యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు...'ఫన్‌మంతు' పేజీ ద్వారా యూట్యూబ్‌లో వచ్చిన వీడియోలను రోస్ట్ చేస్తూ పాపులారిటీ సంపాదించాడు. యూట్యూబ్‌లో పోస్ట్ అవుతోన్న కంటెంట్‌ను తమకు అనుకూలంగా మార్చుకొని, తన మిత్రులతో కలిసి బ్లాక్ కామెడీ పేరుతో, అశ్లీల కామెంట్లతో, వెకిలి నవ్వులతో వెగటు పుట్టిస్తున్నాడు. తాజాగా... తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని తెలుపుతూ... అమెరికాలో ఉంటున్న ఓ తెలుగు కుటుంబం షేర్ చేసిన రీల్‌పై అశ్లీలమైన, అనాగరికమైన జోకులు వేశాడు. తన మిత్రులతో కలిసి చేసిన ఈ నీలి వ్యాఖ్యల లైవ్ వీడియో చాటింగ్ ప్రజలలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. తన చర్యలను డార్క్ కామెడీ అని సమర్థించుకుంటూ అతను విడుదల చేసిన క్షమాపణల వీడియోలో కూడా 'తమ మాటలను సరిగా అర్థం చేసుకోలేదంటూ' చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. 'దారుణంగా వీడియోలు చేస్తున్నారని, చిన్న పిల్లల విషయంలో అసభ్యంగా ప్రవర్తిస్తూ నీచంగా వీడియోలు చేసే వారిని చూస్తే భయంతో పాటు అసహ్యమేస్తోందని' కొందరు సెలబ్రిటీలు స్పందించే వరకూ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఆ ఒక్కడే కాదు... ఇలాంటి నీలి గార్దభాలు సోషల్ మీడియాలో చాలామందే వున్నారు.

సోషల్ మీడియా సామాన్యుల భావ ప్రకటనకు వేదిక. కానీ నేడు అడ్డూ అదుపూ లేని తప్పుడు సమాచారాన్నీ, వందతులను కూడా వ్యాప్తి చేస్తోంది. కొందరు వ్యక్తులు తమ పైశాచిక ఆనందం కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. మానవత్వం మరిచి మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. చిన్నారి నుంచి పండు ముదుసలి వరకూ ఎవరినీ వదలడంలేదు. డీప్‌ఫేక్ పేరుతో ఫొటోలను మార్ఫింగ్ చేసి శునకానందం పొందుతున్నారు. హాస్యం ముసుగులో నీచమైన వీడియోలు పెడుతూ సాంస్కృతిక కాలుష్యాన్ని వెదజల్లుతున్నారు. చవకబారు హాస్యం కోసం కుటుంబ సంబంధాలను అశ్లీలం చేస్తున్నారు. ఇలాంటి ప్రవృత్తి సమాజానికి ప్రమాదకరం. పిల్లల భద్రత విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మంచిని కాంక్షించే గొంతులు, సమాజ హితం కోరే మనుషులు... ఈ అశ్లీల ప్రళయాన్ని, 'నీలి' విధ్వంసాన్ని ఆపండని ఘోషిస్తూనే వున్నాయి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించనంత వరకు ఈ 'నీలి' తుఫాను అందరి మెదళ్లను భ్రష్టుపట్టిస్తూనే వుంటుంది. అశ్లీలతను అరికట్టే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట



కమ్యూనిజం సిద్ధాంతాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే ప్రయివేటు ఆస్తిని రద్దు చేయడమే.

- కారల్ మార్క్స్

Karl Marx

త్రిశూల వ్యూహంపై సుప్రీం సవాళ్లు

ప్రస్తుతం

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు విషయంలో మోడీ త్రిశూల వ్యూహం... అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టునే ఆశ్చర్యానికి, ఆగ్రహానికి గురిచేసింది. ఆయనకు ఒకటికి రెండు సార్లు ఉపశమనం ఇచ్చిన సుప్రీం కోర్టు మరోవైపున అసలు ఈ తతంగమంతటినీ రాజ్యాంగ సమీక్ష చేయాలని నిర్ణయించింది. అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని కూడా నియమించబోతున్నది. ఈ మధ్యంతర బెయిలు మంజూరుపై ఆప్ హర్షం వ్యక్తం చేస్తూ మోడీ సర్కారు నిజ స్వరూపం బహిర్గతమైందంటుంటే బిజెపి మాత్రం తమ వాదనే నెగ్గిందని వింత ప్రచారం చేస్తున్నది. ఇ.డి కేసులో బెయిలు లభించినా ఆ వెంటనే బనాయించిన సిబిఐ కేసులో కేజ్రీవాల్ ఇంకా ఖైదులోనే వుంటారు గనక వెంటనే దీని ప్రభావం కనిపించకపోవచ్చు గాని... ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, లేవనెత్తిన ప్రశ్నలు, చేయబోతున్న విచారణ మాత్రం ప్రజాస్వామికవాదులు లేవనెత్తుతూ వస్తున్న విమర్శలకు ప్రతిస్పందనగా కనిపిస్తాయి.

ప్రత్యర్థి పార్టీలపైన, రాష్ట్ర ప్రభుత్వాలపైన తన త్రిశూల వ్యూహంతో దాడి చేయడం నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆరితేరింది. కానీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు విషయంలో ఇదే వ్యూహం అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టునే ఆశ్చర్యానికి, ఆగ్రహానికి గురిచేసింది. ఆయనకు ఒకటికి రెండు సార్లు ఉపశమనం ఇచ్చిన సుప్రీం కోర్టు మరోవైపున అసలు ఈ తతంగమంతటినీ రాజ్యాంగ సమీక్ష చేయాలని నిర్ణయించింది. అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని కూడా నియమించబోతున్నది. ఈ మధ్యంతర బెయిలు మంజూరుపై ఆప్ హర్షం వ్యక్తం చేస్తూ మోడీ సర్కారు నిజ స్వరూపం బహిర్గతమైందంటుంటే బిజెపి మాత్రం తమ వాదనే నెగ్గిందని వింత ప్రచారం చేస్తున్నది. ఇ.డి కేసులో బెయిలు లభించినా ఆ వెంటనే బనాయించిన సిబిఐ కేసులో కేజ్రీవాల్ ఇంకా ఖైదులోనే వుంటారు గనక వెంటనే దీని ప్రభావం కనిపించకపోవచ్చు గాని...ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, లేవనెత్తిన ప్రశ్నలు, చేయబోతున్న విచారణ మాత్రం ప్రజాస్వామిక వాదులు లేవనెత్తుతూ వస్తున్న విమర్శలకు ప్రతిస్పందనగా కనిపిస్తాయి. ఎందుకంటే సిబిఐ, ఐ.డి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్), ఐ.టి (ఇన్‌కంటాక్స్) విభాగాలను ఎప్పటికప్పుడు ఏదో కేసు పేరుతో పురికొల్పి నాటకీయంగా అరెస్టులు దాడులు చేయడం, బడా మీడియాలో వ్యతిరేక కథనాలు గుప్పించడం పరిపాటి అయింది. నిజానికి ఏ రోజు ఎక్కడ ఎవరిని ఎలా అరెస్టు చేస్తారో అనేలా అప్రజాస్వామిక వాతావరణం ఏర్పడింది. అవినీతి ఆరోపణలు ఎప్పుడు ఎవరి మీద వచ్చినా సరైన పద్ధతిలో నిబంధనల అనుసరించి దర్యాప్తు చేయవలసిందే, కోర్టులలో విచారించి చట్ట ప్రకారం శిక్ష విధించవలసిందే. కానీ దానికి ఒక పద్ధతి వుంటుంది. క్రమం వుంటుంది. అందుకు భిన్నంగా అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్న బిజెపి ఎన్‌డిఎ సర్కారుపై మూడు కేంద్ర సంస్థలలో దేన్నయినా ప్రయోగించడం, ఒకటి విఫలమైతే లేక వ్యతిరేక తీర్పు వస్తే మరొకదాన్ని రంగంలోకి దింపడం ఇందులో సర్వసాధారణం,



తెలకపల్లి రవి

ఇద్దరు సి.ఎం ల అరెస్టు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనేది ఇప్పటికి దాదాపు రెండేళ్లుగా నానుతూనే వుంది. ఈ క్రమంలో అనేకమంది ఆప్ మంత్రులు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి, కెసిఆర్ కుమార్తె కవితతో సహా అరెస్టయి జైలులో వున్నారు. అనేక దశలుగా ఆ కేసు కొనసాగుతున్నది. అయితే ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అరెస్టు చేయడం అనుమానాలకు కారణమైంది. అంతకు ముందే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ అరెస్టు కూడా జరిగింది. అయితే జైలుకు వెళ్లే ముందు ఆఖరి నిముషంలో సమయం తీసుకుని ఆయన తన స్థానంలో చంపై సోరేన్‌ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కాలంలో బీహార్ ముఖ్యమంత్రిగా వున్న లాలూ ప్రసాద్ యాదవ్ రబ్రీదేవిని, తమిళనాడులో జయలలిత పన్నీరు సెల్వంను అలాగే ప్రతిష్ఠించి విచారణను శిక్షలను ఎదుర్కొన్నారు. ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్ తనకూ ఈ కేసుకూ సంబంధం లేదని వాదించడమే గాక రాజీనామా చేయడానికి నిరాకరించారు. రాజ్యాంగంలో ఎక్కడా ఆ విధమైన నిబంధన లేదని వాదించారు. ఢిల్లీ పరిమిత అధికారాలు గల రాష్ట్రం గనక లెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న బిజెపి నేత విజయ్ కుమార్ సక్సేనా కూడా కేజ్రీ ప్రభుత్వాన్ని చిందర వందర చేయడానికి శాయశక్తులా ప్రయత్నించినా ఎదురు తిరిగి పోరాడుతూ వస్తున్న ఆప్ ఈ విషయంలోనూ రాజీకి నిరాకరించింది. దీనిపై దాఖలైన వాజ్యాలను విచారించిన ఉన్నత న్యాయస్థానాలు సుప్రీం కోర్టు కూడా అరెస్టయితే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదు గనక తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని గతంలోనే స్పష్టం చేసింది. దిగువ న్యాయస్థానాలు, ఆ పైన ఢిల్లీ హైకోర్టు నిర్ణయాలేమైనప్పటికీ సుప్రీం కోర్టు నిర్ణయంతో కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం కోసం గతంలో మధ్యంతర బెయిలు కూడా లభించడం ఒక సంచలనమైంది. పౌర హక్కుల కోణంలోనేగాక ఒక రాజకీయ పార్టీ కీలక నాయకుడుగా ప్రభుత్వ అధినేతగా తనకు ప్రచారంలో పాల్గొనే అవకాశం నిరాకరించడమంటే ఎన్నికల్లో సమాన అవకాశాల సూత్రం దెబ్బతింటుందని కేజ్రీవాల్ వాదించారు. ఆ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. లిక్కర్ కేసు లోతుపాతుల్లోకి వెళ్లకుండా కేవలం ప్రచారంకోసం మాత్రం నిర్ణీత వ్యవధితో విడుదల చేసింది. ఈ సమయంలో ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకూడదని, ఏ పత్రాలపై సంతకాలు చేయరాదని ఆదేశించింది. ఆ గడువు ముగిసే ముందుగానే పొడగింపునకు ఆయన ప్రయత్నించినా నిరాకరించింది.

హైకోర్టుపై అసంతృప్తి

గడువు ముగిసి జూన్ 2న మళ్లీ తీహార్ జైలులో తనను తాను స్వాధీన పరుచుకున్న కేజ్రీవాల్ మళ్లీ మామూలు బెయిలు కోసం ప్రయత్నించగా రౌస్ అవెన్యూ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీనిపై పూర్తి ఉత్తర్వు రాకముందే ఢిల్లీ హైకోర్టు మౌఖిక ఉత్తర్వుతో స్టే విధించింది. పూర్తి ఉత్తర్వు తర్వాత ఇస్తానని వాయిదా వేసింది. దీన్ని కేజ్రీవాల్ మరోసారి సుప్రీంలో సవాలు చేయగా ఈ పద్ధతిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. బెయిలు నిలిపివేయడం వంటి విషయంలో లిఖితపూర్వక కారణాలు ఇవ్వాలని స్పష్టం చేస్తూనే హైకోర్టు పూర్తి నిర్ణయం చూడకుండా స్పందించడం సరికాదన్నారు. ఆ తర్వాత దశలో హైకోర్టు బెయిలు నిరాకరించింది గానీ కింది కోర్టులోనూ హైకోర్టులోనూ అనేక ఆశ్చర్యకరమైన అంశాలు బయటికి వచ్చాయి. హైకోర్టు తీర్పు వెలువడే లోపల సిబిఐ ఆయన అరెస్టుకు నోటీసు ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వు తర్వాత విచారణ చేపట్టి తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలే చేసింది. దీనికి సమాంతరంగా పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి విచారిస్తున్న మరో కేసులో సుప్రీంకోర్టు సిబిఐ పూర్తిగా కేంద్ర అధీనంలోని సంస్థ మాత్రమేనని అదేదో స్వతంత్ర సంస్థ అన్నట్టు చెప్పడం సరికాదని తేల్చి చెప్పింది. ఇ.డి కేసుల్లో అరెస్టులు చేసేప్పుడు ఆ అధికారుల చిత్తవృత్తిని బట్టి తప్ప నిర్దిష్టమైన ఆధారాలతో జరగడం లేదని మరో కేసులో వ్యాఖ్యానించింది. హైకోర్టులు బెయిలు రద్దు చేయడం ఏదో శిక్ష అన్నట్టు వ్యవహరించడం సరికాదని కూడా సుప్రీం కోర్టు మరో బెంచి ఇదే సమయంలో తీర్పునిచ్చింది. వీటన్నిటితో కేజ్రీవాల్‌పై ఏ తీర్పు వస్తుందనే ఉత్కంఠ నెలకొన్నది.

విచారణ సమయంలోనే కేజ్రీవాల్ తరపు సీనియర్ అడ్వకేట్లు ఇ.డి వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. 2021 నుంచి విచారణ సాగుతుండగా సరిగ్గా ఎన్నికల తరుణంలోనే అరెస్టు చేయడం రాజకీయ ప్రేరితమని ఆరోపించారు. ఎక్కడా ఎలాంటి ఆధారాలు గానీ, నగదు లావాదేవీల వివరాలు గానీ లేకుండా కేవలం నిందితులలో ఒకరైన మాగుంట శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటల ఆధారంగా ముఖ్యమంత్రిని అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు (ప్రస్తుతం టిడిపి ఎం.పి మాగుంట). తొలుత చెప్పిన దానికి, తర్వాత చెప్పిన దానికి తేడా వుందని కేజ్రీవాల్ భార్య సునీత మీడియాకు వివరించారు. ఆయన ఎన్‌డిఎలో కలిశాకే కేజ్రీవాల్ ముడుపులు అందుకున్నారనే కథనం మొదలెట్టారు.). ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్‌కు ఈ కేసుతో సంబంధం వుందని ఇ.డి తరపున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది వాదించారు. అయితే సంబంధం వుంది గనక విచారించాలనుకున్నా అరెస్టు చేస్తే తప్ప విచారించలేరని ఎలా చెప్పగలరని కోర్టు మరీ మరీ ప్రశ్నించింది. మేము నోటీసులు ఇచ్చినా ఆయన హాజరు కాలేదు గనక అరెస్టు చేయవలసి వచ్చిందని ప్రభుత్వం వాదించింది. అయితే 2022 ఆగస్టులో నమోదైన కేసుకు సంబంధించి 2024 మార్చిలో అరెస్టు అవసరం ఏముంటుందని కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

అరెస్టుకు ప్రాతిపదిక ఏమిటి?

దాంతో సుప్రీం కోర్టు అసలు ఏ పరిస్థితులలో అరెస్టు చేయాలనే దానిపై ఇ.డి కి ఒక నిర్దిష్టమైన విధానం వుందా అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. సదరు వ్యక్తికి సంబంధించి అందుబాటులో వున్న సమాచారం బట్టి వాస్తవికంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందా? ఇ.డి అధికారుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఎలా చేస్తారని నిలదీసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ (పిఎంఎల్ఎ) సెక్షన్19(1) కింద అరెస్టు చేసేందుకు ఇ.డి అధికారులకు ఇచ్చిన అధికారం చాలా తీవ్రమైందని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తీర్పు రాసిన జస్టిస్ ఖన్నా ఇందుకు సంబంధించిన వివరాలు కూడా పొందుపర్చారు. 2023 నాటికి ఇడి దగ్గర 5906 కేసుల నివేదికలు నమోదైనాయి. 4564 నోటీసులు ఇచ్చి 531 మందిని మాత్రం విచారించారు. ఇందులో 176 ఎంపిలు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలకు సంబంధించినవి. 1142 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు నమోదు కాగా 513 మందిని అరెస్టు చేశారు. ఈ సంఖ్యలు వాటిలో తేడాలు చూస్తే చాలా సందేహాలు కలుగుతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫలానా వ్యక్తి నేరం చేసి వుంటారని ఇ.డి అధికారి తన స్వీయ భావనకు వచ్చినంత మాత్రాన అరెస్టు చేయడానికి ఎలా అధికారమిస్తారని ప్రశ్న వేసింది. దర్యాప్తు అధికారి ఆ విధమైన అంచనాకు రావడానికి కారణాలేమిటో లిఖితపూర్వకంగా అందజేయడం అవసరమనే కేజ్రీవాల్ వాదనతో కోర్టు ఏకీభవించింది. ఇక్కడ ప్రస్తావించిన అంశాలు గత చాలా కాలంగా ప్రతిపక్షాలు, న్యాయ నిపుణులు లేవనెత్తుతూ వస్తున్నవే. చట్టానికి సంబంధించిన ఈ మౌలిక ప్రశ్నలు మరింత లోతుగా చర్చించేందుకు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావాలని కోర్టు భావించింది. అరెస్టు చేయడాన్ని ప్రశ్నించడం, అరెస్టు చేయవలసిన అవసరం వుందా అనేదాని ఆధారంగా అరెస్టు ఉత్తర్వును ప్రశ్నించవచ్చునా? మామూలు లెక్కల ప్రకారం అరెస్టు అవసరమని భావించి చేయొచ్చునా లేక ఆ వ్యక్తికి సంబంధించిన కారణాలు, పరిస్థితులు, సామగ్రి కూడా పరిగణనలోకి తీసుకోవాలా? ఈ రెండు ప్రశ్నలకు ఇ.డి అవుననే సమాధానం ఇచ్చినట్టయితే కోర్టు ఏ కొలబద్దతో విచారించాలి? వీటిని విచారించడానికి సమయం పడుతుంది గనక ఈ లోపల కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిలు మంజూరు చేస్తూ అధికారిక విధులకు మాత్రం దూరంగా వుండాలని నిర్దేశించింది. లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలనకు పంపే వాటిపై తప్ప ఇతర పత్రాలపై లేక తనకు సంబంధించిన కాగితాలపై సంతకాలు చేయరాదని, మాట్లాడరాదని ఆంక్షలు పెట్టింది. కనుక న్యాయస్థానం చాలా పకడ్బందీగానే ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకుందని చెప్పవలసి వుంటుంది. తుది తీర్పు వెలువడితే త్రిశూల వ్యూహాలకు కొంతైనా పగ్గాలు పడొచ్చు.

పేదలను సమాధి చేస్తున్న అవయవ వ్యాపారం

సమస్య

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ అవయవ వ్యాపారం ధనవంతుల జీవన ప్రమాణాలను పెంచుతుండగా మధ్యవర్తులకు లాభాల పంటను పండిస్తున్నది. అదే సమయంలో పేదలను మాత్రం 'సమాధి' చేస్తున్నది. ఇటీవల ఢిల్లీ, విజయవాడలో వెలుగు చూసిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ ఈ ఆర్గాన్ రాకెట్ యథేచ్ఛగా కొనసాగుతుండడం ఆందోళనకు గురిచేస్తున్నది.

ఇండియాలో విదేశీయుల అవయవ మార్పిడి

హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ రాకెట్‌ను ఇటీవల ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఒక డాక్టర్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందులో దాతలు, గ్రహీతలతోపాటు కీలక సూత్రధారి బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. 2019 నుంచి ఈ ఆర్గాన్ రాకెట్ కొనసాగుతున్నదని నిర్ధారించారు. ఒక్కొక్కరి నుంచి రూ. 25 నుంచి రూ. 30 లక్షలు వసూలు చేస్తున్నారని భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ రాకెట్ ఢిల్లీలోని ఒక మహిళా డాక్టర్ సహాయంతో నోయిడా లోని ఆస్పత్రిలో 15 నుండి 16 కిడ్నీలు మార్పిడి చేసినట్లు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కడికి తీసుకొచ్చి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, బంధువుల పేరుతో ప్రవేశపెట్టి కిడ్నీ మార్పిళ్లు చేస్తున్నట్లు నిర్ధారించారు.

భారతీయులను విదేశాలకు తీసుకెళ్లి...

ఇండియాలో వెలుగుచూసిన పలు ఆర్గాన్స్ రాకెట్లలో అంతర్జాతీయంగా వ్యాపారం కొనసాగుతున్నట్లు తేలింది. 2024 మే లో వెలుగు చూసిన హైదరాబాద్ వయా కొచ్చి టు ఇరాన్ కేంద్రంగా నడిచిన ఓ కిడ్నీ రాకెట్ గతంలో భారతదేశంలో సంచలనం సృష్టించింది. ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కిడ్నీ రాకెట్ ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ముఠా పేద యువకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో కిడ్నీకి రూ.20 లక్షలు ఇస్తామని ఆశ చూపించి ఇరాన్‌కు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిడ్నీలు తీసుకుని తిరిగి ఇండియాకు తీసుకొస్తున్నట్లు నిర్ధారించారు.

పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఆర్థిక పరిస్థితిని, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ. 1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎ.పి ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా 10 శాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.

హైదరాబాద్, కేరళకు చెందిన 40 మంది యువకులను ఇలా ఇరాన్‌కు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీలంక, ఈజిప్ట్, టర్కీలకు సైతం తీసుకెళ్లి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొన్ని కేసుల్లో నిర్ధారించారు.

పేదరికాన్ని ఆసరాగా చేసుకొని...

పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఆర్థిక పరిస్థితిని, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ. 1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎ.పి ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా 10 శాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.

సోషల్ మీడియా ద్వారా...

సోషల్ మీడియా ద్వారానూ అక్రమ అవయవ వ్యాపారం కొనసాగుతున్నట్లు అర్థమవుతున్నది. ఇటీవల విజయవాడలో వెలుగు చూసిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వ్యవహారం కూడా సోషల్ మీడియా పరిచయాల ద్వారానే జరిగినట్లు తెలుస్తున్నది. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇవ్వడంతోనే మధుబాబు దానికి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్‌సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు 2023లో గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఓ ముఠా ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నడుపుతున్నట్లు కేసు దర్యాప్తులో తేలింది. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ. 5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్ బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్‌ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

కిడ్నీలకు ఫుల్ డిమాండ్

అవయవాల మార్పిడిలో కిడ్నీలకు ఫుల్ డిమాండ్ ఉంటున్నది. 'జీవన్ దాన్' వెబ్‌సైట్లలో వంద మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తుంటే వాటిలో కిడ్నీల కోసం ఎదురు చూస్తున్నవారే 70 మంది వరకు ఉంటారు. కిడ్నీ మార్పిడి అవసరమైన వాళ్ల దేశంలో ఏటా సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది వరకు పెరుగుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల నుంచి 9 లక్షల మంది వరకు కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

కఠిన శిక్షలున్నా...

ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. అలాగే రక్త సంబంధీకులు వారి కుటుంబ సభ్యులకు అవయవ దానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. అయితే అవయవ దానం చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఎవరైనా అవయవదానం చేస్తే అది నేరం. వారికి ఐదు నుంచి పది సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది. అవయవ మార్పిడి చట్టం-1994 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి ఆపరేషన్ చేసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, ఆపరేషన్ జరిగిన ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారు. అవయవదాన చట్టంలో 2023లో కేంద్రం కొన్ని మార్పులు చేసింది. నోటో (నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్)లో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అందుబాటులో ఉంచింది. అయినప్పటికీ ఈ రాకెట్లు నడుస్తూనే వున్నాయి.

- ఖిజర్ పాషా,
సెల్ : 8008710143

జనవాక్యం

జీఓ 117 వద్దు

ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండేలా చూడాలి. జీఓ అమలు వల్ల ఒకే కాంపౌండ్ లోని, 250 మీటర్ల పరిధిలో వున్న ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5వ తరగతులు ఉన్నత పాఠశాలలోకి కలిశాయి. దీంతో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుత నియమాల ప్రకారం 20 లోపు విద్యార్థులుంటే ఒక్క టీచరే ఉంటున్నారు. ఒకటి రెండు తరగతులతో 15 వేల స్కూళ్లు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో ఒక్కొక్కరు కనీసం 2, 3 తరగతులను చూసుకోవాల్సి వస్తోంది. అంతే కాకుండా వీరికి ప్రభుత్వం ప్రతిరోజూ బోధనేతర పనులు అప్పగిస్తోంది. దీంతో వారు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. బోధనకు అధిక సమయాన్ని కేటాయించలేక పోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతి పాఠశాలకూ కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను అదనంగా నియమించాలి. జీఓ 117 రద్దు చేయాలి.

- వాసిలి సురేష్,
నెల్లూరు జిల్లా .

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

అమరవీరుల దినోత్సవాన్ని అడ్డుకోలేరు!

- సిపిఎం స్పష్టీకరణ
- కాశ్మీర్ అమరవీరులకు ఘనంగా నివాళి
- పలువురు కాశ్మీరీ నేతల గృహ నిర్బంధం

శ్రీనగర్ : ఆధునిక కాశ్మీర్ చరిత్రలో ముఖ్యమైన రోజుల్లో 1931 జులై 13 ఒకటి. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బాధితులు, అణచివేతకు గురైన ప్రజలు 1931లో చేసిన తిరుగుబాటు చరిత్ర నుండి చెరిపివేయలేం. ఇంతటి చారిత్రక దినాన్ని అధికారికంగా జరుపుకోవడానికి అనుమతించకపోవడం, అమరవీరులకు నివాళులర్పించేందుకు మజారి షుహుదాను సందర్శించకుండా అడ్డుకోవడమనేది కాశ్మీర్ చరిత్రను మార్చేందుకు, ప్రజల హృదయాల్లో నెలకొన్న జ్ఞాపకాలను తుడిచిపెట్టేందుకు చేసే ప్రయత్నంగా వుందని సిపిఎం విమర్శించింది. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని చర్యలు తీసుకున్నా తమ ప్రజల మనసులు, హృదయాల నుండి ఈ చారిత్రక దినం జ్ఞాపకాన్ని తొలగించలేరని సిపిఎం నేత తరిగామి స్పష్టం చేశారు. మన ప్రజలకు మరింత మెరుగైన భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారికి సిపిఎం ఘనంగా నివాళులర్పిస్తోందని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం సంకెళ్ల నుండి సమాజానికి విముక్తి కల్పించేందుకు సాహసోపేతమైన ఈ వీరులు చేసిన త్యాగాలను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు.

అమరవీరుల సమాధి వద్ద నివాళులర్పిస్తున్న బాలుడు

పలువురు కాశ్మీరీ నేతల అరెస్టు

1931లో జులై 13న డోగ్రా పాలకుని సైన్యం చేతిలో ప్రాణాలు కోల్పోయిన 22మంది కాశ్మీరీలకు ఘనంగా నివాళులర్పించేందుకు గానూ అమరవీరుల సమాధి వద్దకు వెళ్లకుండా పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తి సహా పలువురు రాజకీయ నేతలను అరెస్టు చేశారు. తన నివాసం నుండి బయటకు వెళ్లడానికి లేకుండా తనను గృహ నిర్బంధంలో వుంచారని ఆమె తెలిపారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాశ్మీరీల స్ఫూర్తిని నిర్లక్ష్యంగా వున్న ఈ కార్యక్రమాన్ని ఎవరూ తొక్కివేయలేరని ఆమె వ్యాఖ్యానించారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ చైర్మన్ సజాద్ లోనెను కూడా ఇల్లు కదలనీయకుండా నిర్బంధించారు. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనమేమిటో తనకు అర్థం కావడం లేదన్నారు. ఆ అమరవీరులందరూ కాశ్మీర్ హీరోలని వ్యాఖ్యానించారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, మరో నేత నసీర్ అస్లామ్ వని సహా పలువురు నేతలు ఇదే అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

నా ఫోన్‌లో స్పైవేర్

- మోడీ సర్కారు పంపిందంటూ కెసి వేణుగోపాల్ విమర్శ

న్యూఢిల్లీ : ఫోన్‌లో హానికరమైన స్పైవేర్‌తో తనని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు మోడీ ప్రభుత్వం పాల్పడిందని, ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యను తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.

కె.సి వేణుగోపాల్ దీనికి సంబంధించి ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మీకు ఇష్టమైన హానికరమైన స్పైవేర్‌ను నా ఫోన్‌లోకి కూడా పంపినందుకు ధన్యవాదాలు ప్రధాని మోడీ జీ. మీ ఈ ప్రత్యేక బహుమతి గురించి నాకు తెలియజేయడానికి ఆపిల్ దయ చూపింది!. దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం నేరపూరితంగా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో వ్యవహరిస్తోందని తెలుస్తుంది. రాజకీయ ప్రత్యర్థులను అనుసరించడం.. వారి గోప్యతకు భంగం కలిగిస్తున్నారని స్పష్టమవుతుంది.' అని ఆయన తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. రాజ్యాంగంపై దాడిని, బిజెపి ఫాసిస్టు ఎజెండాను ప్రజలు తిరస్కరిస్తారని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలియజేశాయని ఆయన తెలిపారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు పాల్పడినట్లు యాపిల్ ఐ ఫోన్‌లో వచ్చిన మెసేజ్ స్క్రీన్‌షాట్‌ని వేణుగోపాల్ ఈ సందర్భంగా సోషల్‌మీడియాలో షేర్ చేశారు.

అస్సాం వరదల్లో మరో ఏడుగురు మృతి

- 90కి చేరిన మరణాలు

అస్సాం : అస్సాంని వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల కారణంగా శుక్రవారం ఏడుగురు మరణించారని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డిఎంఎ) తెలిపింది. గోల్‌పారా జిల్లాలో నదిలో పడవ మునిగిపోవడంతో ఐదుగురు మరణించారు. నాగోన్, జోర్హాట్ జిల్లాల్లో ఒక్కొక్కరు వరద నీటిలో మునిగి చనిపోయారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 90కి చేరిందని ఎఎస్‌డిఎంఎ నివేదిక తెలిపింది. 75 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 2,406 గ్రామాలు, 3,294.32 హెక్టార్లలో పంట నీటిలో మునిగిపోయింది. బ్రహ్మపుత్ర, బుద్ధిడిహింగ్, దిసాంగ్, కుషియారా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత జిల్లాల్లో 2.95 లక్షల మంది 316 సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

బెంచ్‌ల ఏర్పాటు, నిబంధనల రూపకల్పనకు సిఐసికి అధికారాలు

- సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : బెంచ్‌లను ఏర్పాటు చేసేందుకు, నిబంధనలు రూపొందించేందుకు కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి)కి అధికారాలు వున్నాయని సుప్రీం కోర్టు పేర్కొంది. సిఐసి సమర్థవంతంగా పనిచేయడానికి స్వయంప్రతిపత్తి చాలా కీలకమని వ్యాఖ్యానించింది. అడ్మినిస్ట్రేటివ్ సంస్థల స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛలు వాటికి నిర్దేశించిన విధులను, కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి చాలా కీలకమని పేర్కొంది. నిబంధనల రూపకల్పనకు సిఐసికి అధికారాలు వున్నాయని, ఇటువంటి అధికారాలు ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 12(4) పరిధిలోకి వస్తాయని తెలిపింది. ఢిల్లీ హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పాలనా యంత్రాంగ వ్యవస్థ సమగ్రతను కాపాడాలంటే ఇటువంటి సంస్థల స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు హామీ కల్పించడం ముఖ్యమని సుప్రీం పేర్కొంది.

దుర్భాషలాడుతూ, పిడిగుద్దులు గుద్దుతూ...

- ఒరిస్సా గవర్నర్ కొడుకు కండకావరం !
- లగ్జరీ కార్లు పంపలేదని అధికారిపై చేయి చేసుకున్న వైనం

భువనేశ్వర్ : పూరీ రైల్వే స్టేషన్ నుండి తీసుకురావడానికి తనకు లగ్జరీ కార్లు పంపలేదనే కారణంతో ఒరిస్సా గవర్నర్ రఘువర్ దాస్ కుమారుడు, మరో ఐదుగురు రాజ్‌భవన్‌లో పనిచేసే అధికారిపై చేయి చేసుకున్నారు. చెంపదెబ్బలు, ముఖంపై పిడిగుద్దులు కొడుతూ తన బూట్లను నాకాలంటూ ఆదేశించారు. పూరీలోని రాజ్‌భవన్ ఆవరణలో ఈ నెల 7వ తేదీ రాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది. రాజ్‌భవన్‌లోని గవర్నర్ సెక్రటేరియట్‌లో వైకుంఠ ప్రధాన్ (47) అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి ఆయన అక్కడ వున్నారు. సంఘటన 7వ తేదీన జరిగింది. 10వ తేదీన ప్రధాన్ గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఆ అధికారి రాతపూర్వకమైన ఫిర్యాదు ఇచ్చినా ఇంతవరకు స్పందన లేదు. . 7వ తేదీ రాత్రి 11.45గంటల సమయంలో ఆఫీస్ రూమ్‌లో ఆ అధికారి కూర్చుని వుండగా గవర్నర్ వ్యక్తిగత వంటవాడు వచ్చి కుమార్ మిమ్మల్ని రమ్మంటున్నారని చెప్పారు. కుమార్ వద్దకు వెళ్లారు. గవర్నర్ కొడుకు అసభ్య పదజాలంతో ఆయనను తీవ్రంగా దూషించారు. అందుకు ఆయన అభ్యంతరం చెప్పగా కుమార్, మరో ఐదుగురు ఆయనను చితకబాదారు. ఎలాగో ఒకలా ఆ గది నుండి పరుగెత్తుకుని బయటకు వెళ్లి దాక్కున్నా వదల లేదు. కుమార్ వ్యక్తిగత భద్రతా అధికారులు ఆయనను పట్టుకుని లిఫ్ట్‌లో పైకి లాక్కెళ్లి ముఖంపై పిడిగుద్దులు గుద్దారు. నడుంపైన, కాళ్లపైన ఇలా ఎక్కడ బడితే అక్కడ తన్నారు. ఎడమ కాలు మడమను మెలిపెడుతూ ఇక్కడే, ఇప్పుడే నిన్ను చంపేస్తాం, ఎవరూ కాపాడే వారు లేరు అంటూ కుమార్ రెచ్చిపోయారని ప్రధాన్ తన ఫిర్యాదులో వివరించారు.

గవర్నర్ కొడుకుపై తన ఫిర్యాదును శుక్రవారం మీడియాకు చూపుతున్న రాజ్‌భవన్ అధికారి భార్య సయోజ్.

కాగా ఈ సంఘటనపై వ్యాఖ్యానించాల్సిందిగా కోరగా పూరీ ఎస్‌పి వినీత్ మిత్ర స్పందించలేదు. రాజ్‌భవన్ అధికారులు, ప్రిన్సిపల్ కార్యదర్శి సస్వత్ మిశ్రా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య లేదు. దీంతో ప్రధాన్ భార్య సయోజ్ ఫిర్యాదు ప్రతిని విలేకర్లకు చూపిస్తూ రాష్ట్రపతి విధుల కోసం తన భర్తను నియమించారని కానీ గవర్నర్ కుమారుడి కోసం కాదని అన్నారు. 10వ తేదీన తన భర్త గవర్నర్ కార్యాలయ సీనియర్ అధికారులను కలుసుకుని దీనిపై చర్చించారని తెలిపారు. తన భర్త ఎయిర్ ఫోర్స్‌లో దాదాపు 20ఏళ్లు పనిచేశారని, ఆ తర్వాత ఇక్కడకు వచ్చారని ఆమె చెప్పారు.

కరుగుతున్న మంచు

- వాతావరణమార్పులతో హిమాలయాలకు ముప్పు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదీజలాలు

చండీగఢ్ : హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రధాన నదీ ఛానల్స్‌లో మంచు పొర కరిగిపోతోంది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు ఇదే ప్రధాన కారణమని వాతావరణ మార్పులపై ఏర్పాటుచేసిన రాష్ట్ర కేంద్రం తెలిపింది. హిమాచల్ ప్రదేశ్ శాస్త్ర సాంకేతిక-పర్యావరణ మండలి పరిధిలో ఈ కేంద్రం పనిచేస్తుంది. 2022-23 సంవత్సరంలో శీతాకాలంలో మంచుతో కప్పబడిన ప్రాంతంతో పోలిస్తే 2023-24లో చెనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల పరీవాహక ప్రాంతాల్లో మంచు పొర 12.72 శాతం కరిగిపోయిందని ఆ కేంద్రం ఓ నివేదికలో తెలియజేసింది. జనవరిలో అయితే సట్లెజ్ పరీవాహక ప్రాంతంలో 67 శాతం, రావి పరీవాహక ప్రాంతంలో 64 శాతం, బియాస్ పరీవాహక ప్రాంతంలో 43 శాతం, చీనాబ్ పరీవాహక ప్రాంతంలో 42 శాతం మంచు అత్యంత వేగంగా కరిగిపోయిందని ఆ నివేదిక తెలిపింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అన్ని పరీవాహక ప్రాంతాల్లోనూ మంచు పొర సానుకూల సంకేతాన్ని అందించింది. హిమాచల్‌లోని నదీ పరీవాహక ప్రాంతాల్లో 2023 అక్టోబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకూ శీతాకాలం కొనసాగింది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ చలి అధికంగా ఉంది. సట్లెజ్ మినహా మిగిలిన అన్ని పరీవాహక ప్రాంతాల్లోనూ మంచు పొర కొంత మేర కరిగింది. మంచుతో కప్పి ఉండే అన్ని పరీవాహక ప్రాంతాల్లో ఒక్క చీనాబ్ ప్రాంతమే 50 శాతం మేర ఉంటుంది. దిగువ ప్రాంతంతో పోలిస్తే హిమాలయాల ఎగువ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఈ కారణం వల్లనే మంచు కరుగుతూ ఉంటుంది.

వెట్టి నుంచి భారత వ్యవసాయ కార్మికులకు విముక్తి

- ఇద్దరు గ్యాంగ్ మాస్టర్లు అరెస్టు

రోమ్ : 33మంది భారత వ్యవసాయ కార్మికులకు వెట్టి నుండి విముక్తి కల్పించినట్లు ఇటలీ పోలీసులు శనివారం తెలిపారు. కార్మికులకు మాయమాటలు చెప్పి, మోసపుచ్చిన ఇద్దరు గ్యాంగ్ మాస్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి 5లక్షల యూరోలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ గ్యాంగ్ మాస్టర్లు కూడా భారతీయులే, ఇటలీలోని ఉత్తర వెరోనా ప్రావిన్స్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. యంత్రం కారణంగా చేయి తెగిపోయిన భారతీయ కార్మికుడికి కనీసం వైద్యం కూడా అందించకుండా రోడ్డు పక్కనే పడవేస్తే ఆ వ్యక్తి చనిపోయిన సంఘటన జూన్‌లో చోటు చేసుకుంది. దీంతో ఇటలీలో కార్మిక శ్రమ దోపిడీ బాగా వెలుగులోకి వచ్చింది. తాజా కేసులో వీరిని సీజనల్ వర్క్ పర్మిట్లపై ఇటలీకి తీసుకొచ్చారని, ఒక్కొక్కరు 17వేల యూరోలు చొప్పున చెల్లించాలని, అప్పుడు వారికి మంచి భవిష్యత్తు వుంటుందని హామీలిచ్చారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత వారికి పొలంలో పనులు అప్పచెప్పారు. రోజుకు 10నుండి 12 గంటలు చొప్పున వారంలో ఏడు రోజులు పనిచేయాల్సిందే. వారిచ్చేది గంటకు కేవలం నాలుగు యూరోలు. వారు తమ అప్పులన్నీ తీర్చేవరకు అక్కడ పనిచేయాల్సిందేనని పోలీసులు తెలిపారు. వారందరినీ కట్టుబానిసల్లాగా చూశారని చెప్పారు. శాశ్వతంగా వర్క్ పర్మిట్ కావాలంటే అదనంగా 13వేల యూరోలు చెల్లించాలని, అందుకోసం ఎలాంటి వేతనాలు ఆశించకుండా ఉచితంగా పనిచేయాల్సి వుంటుందని వారిలో కొంతమందికి చెప్పారని పోలీసులు తెలిపారు. వాస్తవానికి వర్క్ పర్మిట్ అనేదే లేదన్నారు. గ్యాంగ్ మాస్టర్లపై బానిసత్వానికి, కార్మిక దోపిడీకి సంబంధించి నేరాలు మోపినట్లు చెప్పారు. బాధితులందరికీ రక్షణ కల్పించి, పని అవకాశాలు కల్పించనున్నట్లు, పైగా చట్టబద్ధంగా వారికి నివాస పత్రాలు అందేలా చూడనున్నట్లు తెలిపారు.

నైలాన్ చుట్టే యంత్రంలో చేయి నలిగిపోవడంతో మరణించిన భారతీయ కార్మికుడు సత్నామ్‌సింగ్‌కు న్యాయం చేయాలని కోరుతూ లాటినాలో గత నెలలో నిరసన తెలుపుతున్న ఇండియన్ కమ్యూనిటీ సభ్యులు (ఫైల్)

గాజాలో జాతీయ, తటస్థ ప్రభుత్వం

- హమాస్ ప్రతిపాదన

గాజా : ఇజ్రాయిల్ దాడులు నిలిపివేసిన తర్వాత గాజాలో 'జాతీయ, తటస్థ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టేలా మద్దతునిస్తామని హమాస్ శనివారం ప్రతిపాదించింది. ఈ దాడులు ముగిసిన తర్వాత గాజా, వెస్ట్ బ్యాంక్‌ల పాలనా బాధ్యతలను జాతీయ, తటస్థ ప్రభుత్వం సమర్థవంతంగా చేపడుతుందని హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు హుసమ్ బద్రాన్ పేర్కొన్నారు. యుద్ధం ముగిసిన తర్వాత గాజా నిర్వహణ అనేది పాలస్తీనా అంతర్గత విషయమని బద్రాన్ స్పష్టం చేశారు. యుద్ధం ముగిసిన రోజు నుండి ఏ విదేశీ శక్తులతోనూ దీనిపై చర్చించేది లేదని తేల్చి చెప్పారు. గాజాపై ఇజ్రాయిల్ తాజా దాడులను ప్రస్తావిస్తూ, చర్చలకు అడ్డం తగులుతున్న పక్షంపై ఒత్తిడి పెంచాల్సిందిగా అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాలస్తీనా సమాచారం కేంద్రం ఒక నివేదిక విడుదల చేసింది. గాజా పశ్చిమ జిల్లాల్లో అంతులేని విధ్వంసం, లెక్క లేనన్ని మరణాలు సంభవించాయని పేర్కొంటూ వాటికి సంబంధించిన భయంకరమైన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. టెల్ అల్ హవా వీధుల్లో కుళ్లిపోయిన శవాలు చెల్లా చెదురుగా పడి వుండడం కనిపిస్తోంది. రాళ్ల కుప్పలు, శిధిలాలు, పేరుకుపోయాయి. సకాలంలో అంబులెన్సులు, సహాయక సిబ్బంది చేరలేకపోవడంతో శవాలు కుళ్లిపోతున్నాయి. గాయపడిన వారిని వందల సంఖ్యలో తరలిస్తున్నా, శిధిలాల కింద ఇంకా వేల సంఖ్యలో మృతులు వుంటారని ఉత్తర గాజాకు చెందిన అంబులెన్సు, అత్యవసర అధికారి ఫార్స్ అఫన్ తెలిపారు.

చెన్నైలో భారీ వర్షం..

- 31 విమాన సర్వీసులకు అంతరాయం

చెన్నై : చెన్నైలో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా 15 విమానాలు చెన్నైలో ల్యాండ్ కావడానికి ఇబ్బందిపడ్డాయి. వీటిలో 4 విమానాలను బెంగళూరుకు పంపించారు. మొత్తం 31 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడిందని ఎయిర్ పోర్టు అధికారులు తెలిపారు. వర్షాలు, విమాన సర్వీసుల రద్దుతో చెన్నైలో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కంటైనర్ టెర్మినల్ మూసివేతతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ. వెయ్యికోట్లు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పాటు అనేక రకాల వస్తువులు భారీగా వచ్చేవి.

తమిళనాడులో అడ్డుకున్నారని....

అదానీ గ్రూపు 2020వ సంవత్సరంలో కృష్ణపట్నం పోర్టును కొనుగోలు చేసింది. అప్పటి వరకు కూడా ఇక్కడి కంటైనర్ టెర్మినల్‌లో భారీగా లావాదేవీలు జరిగేవి. అయితే, యాజమాన్యం చేతులు మారిన తరువాత ఈ పరిస్థితి క్రమేణా మారింది. అదానీ గ్రూపు తమిళనాడులోని ఎన్నూరు, కాటేపల్లి పోర్టులను కూడా కొనుగోలు చేసింది. అక్కడ నుండి ప్రధానంగా బొగ్గు, ఇనుప ఖనిజం ఎగుమతులు, దిగుమతులు చేసేవారు. పెద్ద ఎత్తున కాలుష్యం వస్తుండటంతో స్థానిక ప్రజలు వీటి రవాణాను అడ్డుకున్నారు. రోజుల తరబడి వాహనాలను నిలిపివేశారు. దీంతో కంటైనర్ టెర్మినల్‌ను యాజమాన్యం అక్కడికి తరలించిందని సమాచారం. అక్కడ కాలుష్యానికి కారణంగా ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజ ఎగుమతులు, దిగుమతులను పూర్తిస్థాయిలో కృష్ణపట్నం పోర్టు నుంది నిర్వహిస్తున్నట్లు సమాచారం.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదలకు ప్రధానిని ఒప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే ప్రాణాలర్పించి అయినా విశాఖ స్టీల్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రజలు కాపాడుకుంటారని తీర్మానంలో పేర్కొన్నారు. అత్యంత సమర్ధవంతమైన స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసే బిజెపి చర్యలను వెంటనే విరమించుకోవాని, రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను సమర్ధవంతంగా నడపడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని ఆర్‌కె ఎస్‌వి కుమార్ ప్రతిపాదించారు.

'ఉపాధి' పని దినాలు, వేతనాలు పెంచాలి

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందామని మరో తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. పనిదినాలు, వేతనాలు పెంచాలని ఈ తీర్మానంలో కోరారు. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించి పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేయాలని తీర్మానించింది. దీన్ని కె.శివనాగరాణి ప్రతిపాదించారు.

పారిశ్రామిక ప్రమాదాలు అరికట్టాలి

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు అరికట్టాలని మరో తీర్మానంలో పేర్కొన్నారు. పరిశ్రమల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ముఖ్యంగా ఫార్మా, సిమెంట్, రసాయన పరిశ్రమల్లో ఒకవైపున ఆధునీకరణ పెరిగినా గతం కంటే ప్రమాదాలు పెరిగాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాల వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని, యాజమాన్యాలు లాభాపేక్షతో కనీసమైన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, కార్మికులు ప్రాణాలు పణంగాపెట్టి పనిచేస్తున్నారని తెలిపారు. యాజమాన్యాలకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఈజ్‌ఆఫ్‌డూయింగ్ విధానాన్ని పాటిస్తోందని, పరిశ్రమలో తనిఖీలు ఆపివేసిందని, దీంతో యాజమాన్య నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని వివరించారు. భద్రతా చర్యలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రతిపాదించారు.

తీర్పును హైజాక్ చేయెుద్దంటూ ఫ్రాన్స్‌లో ప్రదర్శనలు, ర్యాలీలు

- మాక్రాన్ తీరుపై ఫ్రెంచి యూనియన్ల ఆగ్రహం

పారిస్ : ఫ్రెంచ్ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును మాక్రాన్ హైజాక్ చేయడంపై ప్రధాన కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధ్యక్షుడి తీరుకు నిరసనగా ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. అవసరమైతే సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించాయి.. ఫ్రాన్స్‌లో అతి పెద్ద ట్రేడ్ యూనియన్ అయిన సిజిటి, మరి కొన్ని సంఘాలు ఈ హెచ్చరిక చేశాయి. కార్మికులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చాయి.. అతి పెద్ద కూటమిగా ఏర్పడిన న్యూ పాపులర్ ఫ్రంట్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకుండా మాక్రాన్ ఇలాగే మొండిగా వ్యవహరిస్తే ఒలింపిక్స్ సమయంలోనైనా సమ్మెకు వెనుకాడేది లేదని సిటిజి ఫెడరేషన్ నాయకులు చెప్పారు. జులై 18న కొత్త పార్లమెంట్ ప్రారంభ సమావేశం జరగాల్సి వుంది. ఇప్పటివరకు వామపక్ష కూటమి నుండి వ్యక్తిని ప్రధానిగా నియమించేందుకు మాక్రాన్ తిరస్కరిస్తున్నారు. సిజిటి యూనియన్ ప్రధాన కార్యదర్శి సోఫీ బినెట్ గురువారం ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్‌కు ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, మాక్రాన్ ఎన్నికల ఫలితాలను గౌరవించకుండా మాక్రాన్ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్‌పిఎఫ్‌ను అనుమతించాల్సిందేనన్నారు. సిజిటిలోని రైల్వే వర్కర్లు 18న దేశవ్యాప్తంగా ర్యాలీలకు పిలుపునిచ్చారు.

ఫ్రెంచి యూనియన్ల నాయకులు

కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

నేపాల్ : నేపాల్‌లో రెండు బస్సులు త్రిశూలీ నదిలో కొట్టుకుపోవడంతో గల్లంతైన 51 మంది ఆచూకీ కోసం శనివారం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. నేపాలీ ఆర్మీ, నేపాల్ పోలీస్, గత ఈతగాళ్లు.. సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. బిర్‌గుంజ్ నుంచి కాఠ్మాండుకు వెళ్తున్న బస్సులో ఏడుగురు భారతీయులుసహా 24 మంది ఉన్నారు. కాఠ్మాండు నుంచి గౌర్ వెళ్తున్న బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ముగ్గురు ప్రయాణికులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సెర్చ్ ఆపరేషన్‌లో సుమారు 500 మంది భద్రతా సిబ్బంది పాల్గొంటున్నారు. శుక్రవారం రాత్రి గాలింపు చర్యల్ని నిలిపివేశారు. నది ఉదతంగా ప్రవహిస్తున్న కారణంగా సెర్చ్ ఆపరేషన్ ఆలస్యమైంది. శనివారం ఉదయం 8 గంటల నుంచి గాలింపు చర్యలు నిర్వహించారు.

సిపిఎం నాయకుని దారుణ హత్య

- త్రిపురలో బిజెపి గూండాల ఘాతుకం
- నేడు బంద్

బెలోనియా : జిల్లా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న సిపిఎం నాయకుడిని బిజెపి గూండాలు దారుణంగా హత్య చేశారు. దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్ 4వ స్థానానికి నామినేషన్ వేసేందుకు సిపిఎం నాయకుడు బాదల్ షిల్ వెళ్తుండగా, శుక్రవారం బెలోనియాలో బిజెపి గూండాలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించగా, శనివారం మరణించారు. ఇప్పటికీ నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదు. ఈ దారుణ ఘటనను సిపిఎం తీవ్రంగా ఖండించింది. బిజెపి గూండాల ఘాతుకాన్ని, నిందితులకు వత్తాసు పలుకుతూ ఇప్పటికీ అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకాన్ని నిరసిస్తూ ఆదివారం 12 గంటల బంద్‌కు సిపిఎం పిలుపునిచ్చింది.

బాదల్ షిల్

నిబంధనల మార్పుతో రబ్బర్ స్టాంప్ సిఎం : ఒమర్

శ్రీనగర్ : జమ్ము కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 నిబంధనల్ని లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను పెంచేవిధంగా కేంద్ర ప్రభుత్వం సవరించడాన్ని జమ్ము కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా తప్పుపట్టారు. ఈ చట్ట సవరింపుల వల్ల అధికారం లేని ముఖ్యమంత్రే పదవిలో ఉంటారని ఆయన అన్నారు. జమ్ము కాశ్మీర్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం చట్ట నిబంధనల్ని సవరించిందని ఆయన మండిపడ్డారు. తాజా నిబంధనలతో ఎన్నికైన ముఖ్యమంత్రి ఎలాంటి అధికారం లేకుండా ఉంటారని విమర్శించారు. అలాంటి రబ్బర్ స్టాంప్ సిఎం కంటే.. అధికారంలోని ప్రజలే ఆ అధికారానికి అర్హులని అన్నారు. ఎన్నికైన సిఎం ప్యూన్‌ని నియమించడానికైనా లెఫ్టినెంట్ గవర్నర్‌ని వేడుకోవాలని, పవర్‌లెస్ సిఎం అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆంధ్రప్రదేశ్ హై కోర్టు, అమరావతి వద్ద
వేలం ప్రకటన

ఆర్‌ఓసి నెం.195/2024-ఏపిహెచ్‌సి వెహికల్స్, తేది: 08.07.2024
మహీంద్రా జైలో కార్, రిజిస్ట్రేషన్ నెం.ఏపి12ఎన్ 6761ను ఎక్కడ ఎలా ఉన్నది &అక్కడ అలాగే ప్రతిపాదికన విస్పోస్‌చేయుటకు ఆం.ప్ర హైకోర్టు నిర్ణయించింది, వెహికల్ తయారీ సంవత్సరం 2013. రిజిస్ట్రేషన్ తేది: 01.06.2013. ఆం.ప్ర. హైకోర్టు, నేలపాడు, తుళ్లూరు మండలం, గుంటూరు జిల్లాలోని ఆవరణలో 20.07.2024న ఉ.11.30గం.లకు వేలం నిర్వహించబడును.
DIPRNo.13704/CL/ADVT/1/1/2021-22 సం/- రిజిస్ట్రార్ (ప్రోటోకాల్)

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
01461 - UMFB గుడివాడ బ్రాంచి
10/52-1, గౌరిశంకరపురం, గుడివాడ - 521301

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB గుడివాడ (పూర్వపు ఆంధ్రాబ్యాంక్) శాఖ # 10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, లాంఛనాత్మకంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB గుడివాడ (పూర్వపు ఆంధ్రాబ్యాంక్) శాఖ # 10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 14-08-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది ఈ-ఆక్షన్‌కి ముందు వరకు**

1) ఋణగ్రహీత, కో-అప్లికెంట్ మరియు హామీదారుల వివరములు : 1) శ్రీ గోరిపర్తి బసవేశ్వరబాబు, తండ్రి : జి. పాపరాజు, డి.నెం. 30/190, మల్కాపట్నం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఏపి - 521001. **2) శ్రీమతి గోరిపర్తి పద్మజ,** భర్త : గోరిపర్తి బసవేశ్వబాబు, డి.నెం. 30/190, మల్కాపట్నం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఏపి - 521001. **3) శ్రీ గోరిపర్తి బసవేశ్వరబాబు,** తండ్రి : జి. పాపరాజు, డి.నెం. 21/444, ఫ్లాట్ నెం. 402, అజంతా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, భాస్కరపురం, 4వ లైన్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఏపి - 521001. **4) శ్రీమతి గోరిపర్తి పద్మజ,** భర్త : గోరిపర్తి బసవేశ్వబాబు, డి.నెం. 21/444, ఫ్లాట్ నెం. 402, అజంతా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, భాస్కరపురం, 4వ లైన్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఏపి - 521001.
బకాయి మొత్తం : డిమాండ్ నోటీసు తేది : 10-05-2023 నాటికి రూ. 12,56,264.80/- (అక్షరాలా పన్నెండు లక్షల యాభై ఆరు వేల రెండు వందల అరవై నాలుగు రూపాయల ఎనభై పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, కాస్టులు & ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీమతి గోరిపర్తి పద్మజ గారి పేరిట ఏపి, కృష్ణా జిల్లా, మచిలీపట్నం, చెమ్మనగిరిపేట, వార్డు నెం. 11, డి.నెం. 11/179 వద్ద 418 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** జి. పాపరాజు గారి కాంపౌండ్ వాల్ కొంత వరకు మరియు పి. నాగులు గారి కాంపౌండ్ వాల్ కొంత వరకు, **దక్షిణం :** పాత్‌వే కొంత వరకు మరియు గడ్డం సూర్యకుమారి గారి కాంపౌండ్ వాల్ కొంత వరకు, **పడమర :** వి. రాధాకృష్ణమూర్తి గారి కాంపౌండ్ వాల్ కొంత వరకు మరియు అన్నం సుబ్బారావు గారి కాంపౌండ్ వాల్ కొంత వరకు, **ఉత్తరం :** అన్నం సుబ్బారావు గారి కాంపౌండ్ వాల్

రిజర్వు ధర : రూ. 52,28,000/- ధరావత్తు : రూ. 5,23,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 53,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://ebkray.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. **అధీకృత అధికారి** గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తులపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం బ్రాంచి హెడ్ మొబైల్ నెం. **8074914547,** బ్రాంచి Mail ID :**ubin0801461@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) /రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 08-07-2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : గుడివాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ UMFB బ్రాంచి

SBI **భారతీయ స్టేట్ బ్యాంక్**
నరసరావుపేట బ్రాంచ్ (0884), నరసరావుపేట
పల్నాడు జిల్లా

స్వాధీనత ప్రకటన

APPENDIX IV రూల్ 8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002, (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచ్, నరసరావుపేట, పల్నాడు జిల్లా** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటిసు లో పేర్కొన్న బకాయి **తేది.30.04.2024 నాటికి HTL ఖాతా నెం.35164947466 కు రూ.9,91,527/- (అక్షరాల తొమ్మిది లక్షల తొంభై ఒక్క వేల ఐదు వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే)** పైన తెలిపిన సొమ్ము మీద కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీ పువ్వుల నాగమల్లేశ్వర రావు గారి భార్య శరణ్య,** ఫ్లాట్ నెం.511, 4వ అంతస్తు, డ్రీమ్ హోమ్ అపార్ట్‌మెంట్స్, సత్తెనపల్లి రోడ్, నరసరావుపేట, పల్నాడు జిల్లా. **హామీదారు : శ్రీ జవాంగుల శ్రీనివాస రావు గారి భార్య శారద,** డోర్.నెం.3-6-4, 3వ లేన్, శివాలయం వీధి, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా వార్లను కోరుతూ **తేది.30-04-2024 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో 8&9 తో చదివే సదరు యాక్టులోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.08.07.2024 న లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు / హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **తేది.30.04.2024 నాటికి రూ.9,91,527/- (అక్షరాల తొమ్మిది లక్షల తొంభై ఒక్క వేల ఐదు వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే)** మరియు సదరు మొత్తంపై వడ్డీ + ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి **భారతీయ స్టేట్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచ్, నరసరావుపేట, పల్నాడు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్ ఎ : పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో లేని, సత్తెనపల్లి రోడ్డు వైపుగా హద్దుగా ఉన్న, నరసరావుపేట రెవిన్యూ ఏరియా, ఇస్సపాలెం పంచాయితీ, నరసరావుపేట రెవిన్యూ డి.నెం.42-బి, 43-ఇ మరియు 44ల వద్ద గల మొత్తము 1873.77 చ॥గ॥లు లేదా 1566.70 చ॥మీ॥ల నందలి అవిభాజ్యమైన మరియు అనిర్దేశ్యపు వాటా మరియు విభజించుటకు వీలులేని 32 చ॥గ॥లకు సరిసమానమగు 26.75 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలము నందు **'డ్రీమ్ హోమ్'** అను పేరుతో నిర్మించబడిన అపార్ట్‌మెంట్. **అపార్ట్‌మెంట్ హద్దులు : తూర్పు :** గుండా నారాయణ & బొలిశెట్టి వెంకటేష్ & ఇతరులు 248 అ॥, **దక్షిణం :** 30 అ॥ల వెడల్పు రోడ్ 68 అ॥లు, **పడమర :** వంగా కోటయ్య గారికి చెందిన ఆస్తి 248 అ॥, **ఉత్తరం :** సందు రామారావు గారికి చెందిన ఆస్తి 68 అడుగులు.
షెడ్యూలు బి : పైన చెప్పిన 'ఎ' షెడ్యూలులో గల అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా 32 చ॥గ॥లకు సరిసమానమగు 26.75 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలముతో ఉన్న **'డ్రీమ్ హోమ్'** యొక్క నాల్గవ అంతస్తుతో గల ఫ్లాట్ నెం.511 యొక్క ప్లింత్ ఏరియా 850 చ॥అ॥లు (ఉమ్మడి ఏరియాలతో కలిపి) రిజిస్టర్డు అమ్మకపు దస్తావేజు నెం.14050/2015, తేది.25.05.2015 ప్రకారం **శ్రీ పువ్వుల నాగమల్లేశ్వర రావు గారి భార్య శరణ్య** గారికి చెందినది. **ఫ్లాట్ హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఉమ్మడి వరండా, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

తేది : 08.07.2024 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : నరసరావుపేట భారతీయ స్టేట్ బ్యాంక్

మీకోసం

సాంబారు మరుగుతున్నప్పుడు ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితంలో అన్నీ కోల్పోయినా భవిష్యత్తు మాత్రం మిగిలే వుంటుంది. దాన్ని జాగ్రత్తగా నిర్మించుకోవాలి.

అవ్వ ఆశీర్వాదం

రవి పాఠశాల ప్రక్కన ఓ అవ్వ 'రూపాయి దానం చేయండి' బాబూ అని స్కూలుకి వచ్చి, పోయే వారిని అడిగేది. కొంతమంది ఇచ్చేవాళ్ళు, మరికొంత మంది పట్టించుకునే వాళ్ళు కాదు. రవి ఆ అవ్వను చూసి జాలిపడేవాడు. పాఠశాల భోజన సమయంలో అన్నం తినేటప్పుడు అవ్వ జ్ఞాపకం వచ్చేది. ఏమి తింటుందో ఏమో అనుకునేవాడు. కొంత అన్నం, పప్పు పక్కకు తీసి అవ్వ కోసం దాచి, పాఠశాల అవ్వగానే అవ్వకు పెట్టాడు. అవ్వ తృప్తిగా తిని "చల్లగా ఉండు నాయనా.. బాగా చదువుకో' అని ఆశీర్వదించింది. కొన్ని రోజుల తరువాత రవికి ఓ రెండు రోజులు అవ్వ కనపడలేదు. విచారిస్తే ఎవరో విదేశీ నాయకుడు వస్తున్నాడని అడుక్కునే వాళ్ళు ఎవరూ ఉండకూడదని దూరంగా తరలించారని చెప్పారు. ఆరోజు తన పుట్టిన రోజు ఈరోజైనా అవ్వ రాకపోతుందా అనుకుంటూ పాఠశాలకు వెళ్ళాడు. పాఠశాల అయిపోగానే ఇంటికి వెళుతుంటే అవ్వ కనిపించింది. అవ్వను చూడగానే కళ్ళు మెరిశాయి. పరుగెత్తుతూ పోయి అవ్వను పలకరించాడు. 'బాగున్నావా నాయనా' అంటూ రవి చెంపలు నిమిరింది. 'బాగున్నా అవ్వ' ఈరోజు నా పుట్టిన రోజు ఇందా ఈ బ్రెడ్ నీ కోసమే' అని అవ్వ నోటికి అందించాడు. అవ్వ తింటూ 'నిండు నూరేళ్ళు జీవించు నాయనా' అని ఆశీర్వదించి ముద్దు పెట్టుకుంది. 'మా మంచి అవ్వ' అని వాటేసుకున్నాడు రవి. పిల్లల్లో వుండే సహజగుణం ఇదే. పేద, ధనిక తారతమ్యాలు వారికి తెలియవు. పెద్దా, చిన్నా అరమరికలు అసలే ఉండవు.

– కనుమ ఎల్లారెడ్డి,
తాడిపత్రి,
93915 23027.

నేను గీసిన బొమ్మ



ఈషాన్ సింహరెడ్డి,
ఏడవ తరగతి,
నారాయణ స్కూల్,
పులివెందుల,
కడప జిల్లా.

పదబంధాలు

పిల్లలూ, ఇచ్చిన క్లూ ఆధారంగా మిగిలిన పదాలు మీరు రాయండి.

కాయం	యంత్రం
ర--	తం-
ధ---	కం-
మం-	చం---
రం-	పం---
రం-	గం-
రా--	సం-
జం-	ట--
మీ-	నం--

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ వికృతాలకు కారకులెవరు?

పార్కులో పిల్లలు ఆడుకుంటున్నారు. మూడేళ్ల నుండి పదేళ్ల పిల్లల అల్లరితో పార్కు అంతా ఒకటే సందడిగా ఉంది. ఆ పిల్లల్లో ఆడ, మగా తేడా లేదు. అందరూ కలసికట్టుగా ఆడుకుంటున్నారు. ఇదే కదా ఎక్కడైనా, ఎప్పడైనా జరిగేది అనుకుంటాం. కానీ ఇప్పుడు జరిగింది వేరు. నంద్యాలలో వారం రోజుల క్రితం జరిగిన హత్యాచార సంఘటనలో బాధితురాలు మూడో తరగతి విద్యార్థిని అయితే, బలి తీసుకున్నవారు 6, 7 తరగతుల విద్యార్థులు. సాధారణంగా ఇలాంటి హత్యాచార సంఘటనలు జరిగినప్పడు 'అమానుషం, అక్రమం, నిందితులను కఠినంగా శిక్షించాలి.' అంటూ నినాదాలు చేస్తాం. కానీ ఇప్పుడు పరిస్థితి అది కాదు.. 'అభం శుభం తెలియని పిల్లల్లో ఇంత వికృత చేష్టలు రావడానికి కారణమెవరు? పిల్లలు ఇంత భయంకరంగా ఎలా ఆలోచించారు? ఇలాంటి అమానుషానికి ప్రత్యక్ష, పరోక్ష కారకులు ఎవరు?

టీవీ కార్యక్రమాల్లో, యూట్యూబ్ కంటెంట్లో ఈ మధ్య ఈవ్‌టీజింగ్ చాలా ఈజీ అయిపోయింది. దానికి పరాకాష్టగా, రోస్ట్ కామెడీ, డాక్ కామెడీ పేరుతో సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు స్వైరవిహారం చేస్తున్నాయి. అలా హాస్యం పేరుతో అసభ్య పదజాలాలతో తండ్రీ, కూతుళ్ల మధ్య నడిచిన ఓ సన్నివేశానికి శృతిమించి వ్యాఖ్యలు చేశాడు ప్రణీత్ హనుమంతు అనే ఓ యూట్యూబర్. అందమైన బంధాన్ని అత్యంత జుగుప్సగా వ్యాఖ్యానిస్తూ, అపహాస్యం చేశాడు.

మన చుట్టూ తమ గారాలపట్టిని అరచేతుల్లో నడిపించే తండ్రులు ఎంతోమంది. మెడలపై ఎక్కించుకుని ఊరేగించేవారు, ఏనుగు అంబారీలా మారిపోయి, సవారీ చేయించే నాన్నలు కోకొల్లలు. ఇంతటి చక్కనైన బంధం గురించి సిగ్గుపడే మాటలతో కారుకూతలు కూశాడు ప్రణీత్. ఈ వీడియో వైరల్ అయ్యింది. లక్షమందికి పైగా వీక్షించారు. ఇంత జరిగినా పెద్దగా వెలుగులోకి రాలేదు. కానీ ఎప్పుడైతే తెలుగు నటులు సాయి ధరమ్ తేజ్, మంచు మనోజ్, నందు, గాయని చిన్మయి దీనిపై ధ్వజమెత్తారో – అప్పుడే దీని గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. తేజ్, మనోజ్ అయితే ఒకడుగు ముందుకు వేసి అతని ధోరణి సరికాదంటూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు కూడా చేశారు. ఆగమేఘాల మీద ఉత్తర్వులు వచ్చాయి. సదరు యూట్యూబర్ అరెస్ట్ అయ్యాడు. సమాజం పట్ల ఒక బాధ్యతాయుతమైన పని చేసిన ఈ నటీనటులు ప్రశంసనీయులే. అయితే కథ ఇంతటితో ముగియలేదు. దీనికి ముందు జరిగిన పరిణామాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి.

ప్రణీత్ హనుమంతు.. సాదాసీదా అబ్బాయి కాదు. ఉన్నత విద్యావంతులైన తల్లిదండ్రుల ముద్దుల కుమారుడు. స్వశక్తితో తన కొడుకు ఎదిగిన తీరుకి తెగ మురిసిపోయిన, ఐఎఎస్ అధికారి అయిన అతని తండ్రి ఎన్నోసార్లు పలు ఇంటర్వ్యూల్లో కొడుకు గురించి గొప్పగా చెప్పారు. తల్లి కూడా చైల్డ్ రైట్స్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉన్నత కొలువులో ఉన్నారు. ఇట్లాంటి నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన ప్రణీత్, స్వతహాగానే సెలబ్రిటీ హోదాలో తిరిగేవాడు. యూట్యూబ్‌లో కంటెంట్ క్రియేట్ చేసి వీడియోలు చేసేవాడు. అతడి యూట్యూబ్ ఛానెల్‌ని సబ్‌స్క్రైబ్ చేసుకోమని ఓ సారి పెద్ద వేదికపై ప్రముఖ యాంకర్ సుమ ప్రచారం కూడా చేశారు. నాని, కార్తికేయ వంటి యువ హీరోలను ఇంటర్వ్యూలు చేసిన ప్రణీత్‌ని ప్రోత్సహిస్తూ ఓ సినిమాలో ఛాన్స్ కూడా ఇచ్చారు. ఇంత ప్రోత్సాహం ఇచ్చే ముందు, అతడు ఏం వీడియోలు చేస్తున్నాడో, ఎంత నీచంగా ఉంటున్నాయో అన్న స్పృహ లేకుండా ఉందా! అనేది అనుమానమే.

ఆ జోకులు, ప్రేలాపనలు బుల్లితెర కామెడీ షోలలో ఎప్పుడూ ఉండేవే. పగలబడి నవ్వుకోవాలంటే ఆ మాత్రం కామెంట్స్ తప్పనిసరి అన్న ధోరణి ప్రతి ఒక్కరిలోనూ ఉంది. అదే ప్రణీత్ క్యాష్ చేసుకున్నాడు. అయితే ఇంకాస్త డోసు పెంచాడు.

ఇన్‌స్టాలో రీల్స్ చేసి పోస్టు చేయడం చాలామందికి అలవాటు. పిల్లల డ్యాన్స్ వీడియోలు, అందంగా ముస్తాబైన వీడియోలు, పిల్లల అల్లరి ఇలా ఎన్నో రీల్స్‌తో ఇన్‌స్టా ఖాతాలు నిండిపోతాయి. ప్రణీత్‌కి అవే ముడిసరుకు. డాక్ కామెడీ పేరుతో ఎక్కడెక్కడో ఉన్న రీల్స్‌ని తీసుకొచ్చి తన వికృత వ్యాఖ్యలను జోడిస్తాడు. రోస్ట్ కామెడీ, డాక్ కామెడీ పేరుతో ప్రణీత్ లాంటి వాళ్లు ఎందరో ఇప్పుడు సోషల్‌మీడియాలో కుప్పలుతెప్పలుగా వీడియోలు చేస్తున్నారు. వీటిలో అసభ్యం, అశ్లీలం, పిల్లలు చూడకూడని, వినకూడని మాటలు కూడా ఉంటున్నాయి. పెద్దలే సిగ్గుపడేలా ఆ వ్యాఖ్యలు ఉంటాయన్నది అసలు నిజం.

ఈ వికృతాలను ఎక్కువగా చూస్తున్న వారిలో పిల్లలే అత్యధికంగా ఉంటున్నారు. వాటిలో చూపించే కంటెంట్ వారి పసి మనసుల్లో ఎంతటి విషపు బీజాలు నాటుతుందో తాజా నంధ్యాల ఘటనే ఉదాహరణే. అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న పిల్లలు ఏం చేస్తున్నారో, ఏం వింటున్నారో తల్లిదండ్రులు గమనించుకోకపోతే నంధ్యాల లాంటి సంఘటనలు పునరావృత మవుతూనే ఉంటాయి. ప్రణీత్ లాంటి ప్రబుద్ధులు కుప్పలు తెప్పలుగా పెరిగిపోతారు. ఈ పరిస్థితిని మార్చటం సమాజంలోని అందరి బాధ్యత.

సెలబ్రిటీల చొరవ

సమాజంలో జరగుతున్న అన్యాయాలపై, అక్రమాలపై సెలబ్రిటీలు స్పందిస్తే ఎలా ఉంటుందో తాజా ప్రణీత్ అరెస్టుతోనే అర్థమౌతోంది. ఒకప్పటి నటీనటులు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేవారు. ఈ తరం వాళ్లకి ఆ చొరవ కొరవడింది. అయితే ప్రస్తుత పరిణామాలపై యువ నటీనటులు స్పందించడం ప్రశంసనీయం. ఈ చొరవ ఎప్పుడూ ఉండాలి. చెడుపై తమ గళాన్ని గట్టిగా వినిపించాలి. సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులు ఆచరించే విధానాలు ప్రజలను ఎప్పుడూ ఆలోచించేలా చేస్తాయి.. ఆచరణకూ దారితీస్తాయి.

అంబానీల వివాహం

అసమానతలతో కూడిన దేశంలో సంపద వికార ప్రదర్శన

ముంబయి: అపర కుబేరుడు ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుక సంపద వికార ప్రదర్శనకు వేదికగా మారింది. మూడు దశల్లో జరిగిన ఈ వివాహ వేడుకల కోసం అక్షరాలా అయిదు వేల కోట్ల రూపాయలు (675 మిలియన్ డాలర్లు) ఖర్చు చేసినట్లు అంబానీ కుటుంబ వర్గాలు తెలిపాయి. రిలయన్స్ మాత్రం తమ వార్షిక ఆదాయంలో 0.5 శాతం మాత్రమే ఈ వేడుకకు వెచ్చించినట్లు చెబుతోంది. పూర్వం రాజులు ఇటువంటి ఆర్భాటాలు ఎక్కువగా ప్రదర్శించేవారు.

ఆ విధంగా తమ సంపద గొప్పతనాన్ని చాటుకునేందుకు యత్నించేవారని చరిత్రకారులు చెప్పగా విన్నాం. కానీ, నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. రాచరికం పోయినా ఆ వికార సంస్కృతి ఇంకా కొనసాగుతోందనడానికి అంబానీ కుమారుడి వివాహమే ఒక ఉదాహరణ. 1633లో మొఘల్ రాజు షాజహాన్ పెద్ద కుమారుడు దరషుకో పెళ్లికి 32 లక్షల రూపాయలు ఖర్చు చేశారని ప్రతీతి. అంటే నేటి ధరల ప్రకారం 48 మిలియన్ డాలర్లు. అంటే షాజహాన్ కుమారుడి పెళ్లికి పెట్టిన ఖర్చుకు 20 రెట్లు అధికంగా ముఖేష్ అంబానీ కుమారుడి పెళ్లికి ఖర్చు చేశారన్నమాట. మూడు దశల్లో చివరిది అయిన వివాహ వేడుక శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు బాలీ వుడ్, టాలీవుడ్, కాలీవుడ్‌లకు చెందిన అగ్ర శ్రేణి నటీ నటులతో సహా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

హాజరైన ప్రధాని మోడీ, అదానీ

అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుకకు ప్రధాని నరేంద్రమోడీ శనివారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు.

వింబుల్డన్ విజేత క్రేజికోవా

- ఫైనల్లో 7వ సీడ్ పౌలినిపై గెలుపు
- నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను 31వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన బార్బోరా క్రేజికోవా చేజిక్కించు కుంది. శనివారం జరిగిన మూడుసెట్ల హోరాహోరీ ఫైనల్లో క్రేజికోవా 7వ సీడ్ జాస్మినే పౌలిని (ఇటలీ)పై విజయం సాధించింది. ఉత్కంఠభరి తంగా సాగిన ఫైనల్లో క్రేజికోవా 6–2, 2–6, 6–4తో పౌలినిని చిత్తుచేసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో క్రేజికోవా 4–5పాయింట్ల ఆధిక్యతలో ఉండి చివరి పాయింట్ సాధించేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. 2021లో క్రేజికోవా తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను చేజిక్కించుకోగా.. మూడేళ్ల తర్వాత వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకొని కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్‌ను చేజిక్కించుకొంది. చెక్ రిపబ్లిక్ తరఫున వోంద్రుసోవా, పెట్రా క్విటోవా, జానా నవోత్నా తర్వాత వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ నెగ్గిన మరో చెక్ క్రీడాకారిణిగా క్రేజికోవా మాత్రమే.

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆదివారం జరగనుంది. గత సీజన్ ఫైనలిస్టులు కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్), నొవాక్ జకోవిచ్(సెర్బియా)ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అల్కరాజ్ వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు చేరుకొని రెండోటైటిల్‌పై గురి పెట్టాడు. మరోవైపు గత సీజన్ ఓటమికి బదులు తీర్చుకోవాలని జకోవిచ్ భావిస్తున్నాడు. ఈ మ్యాచ్ వీక్షించేందుకు అభిమానులు పోటెత్తనున్నట్లు సమాచారం. ఫ్యాన్స్ ఇంట్రెస్ట్‌ను సొమ్ము చేసుకు నేందుకు నిర్వాహకులు టిక్కెట్ రేటును రూ.3 కోట్లుగా నిర్ణయించినట్లు సమా చారం. కనీస ప్రారంభ టికెట్ ధర రూ.8.85 లక్ష లుగా ఉంది. ఇక సెంటర్ కోర్టుకు సమీపంగా ఉండే సీట్ల ధర రూ.31 లక్షలు కాగా.. మరికొన్ని సీట్ల ధర రూ.3కోట్లు ఉంది. దాంతో, ఈసారి వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లకు క్రీడా చరిత్రలో కనీవినీ ఎరుగని ధర పలికింది.

క్రేజికోవా విజయనాదం

రన్నరప్ ట్రోఫీతో పౌలిని

క్రేజికోవా టైటిల్ కొట్టిందిలా..

ఫైనల్	: పౌలిని(7)	6–2, 2–6, 6–4(గెలుపు)
సెమీఫైనల్	: రైబకినా(4)	3–6, 6–3, 6–4(గెలుపు)
క్వార్టర్‌ఫైనల్	: ఒస్టాపెంకో(13)	6–4, 7–6(7–4)(గెలుపు)
ప్రి క్వార్టర్స్	: కోలిన్స్(11)	7–5, 6–3(గెలుపు)
మూడోరౌండ్	: బౌజాస్	6–0, 6–3(గెలుపు)
రెండోరౌండ్	: వోలైనెట్స్	7–6(8–6), 7–6(7–5)(గెలుపు)
తొలిరౌండ్	: కుడెర్నెటోవ్సా	7–6(7–4), 6–7(1–7), 7–5(గెలుపు)

వెయ్యి కోట్ల క్లబ్‌లో 'కల్కి'

ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'కల్కి 2898ఏడీ'. జూన్ 27న విడుదలైన ఈ చిత్రం తాజాగా 1000 కోట్ల క్లబ్‌లో చేరింది. ఓవర్సీస్‌లోనే దాదాపుగా రూ.200 కోట్లు కలెక్ట్ చేసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదలైంది. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ తరువాత రూ. 1000 కోట్లు సాధించిన తెలుగు చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' నిలిచింది. ఇందుకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ కర్ణుడు గెటప్‌లో కనిపిస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకునే, దిశాపటాని ముఖ్యపాత్రల్లో నటించారు.

ఐదు యూట్యూబ్ ఛానల్స్‌ని తొలగించారు : మా

తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా తెలుగు సినీ నటుల మీద అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ చేస్తూ నటీనటుల అసభ్యకర వీడియోలను సోషల్ మీడియాలో వదులుతున్న ఐదు యూట్యూబ్ ఛానల్స్‌ను సైబర్ క్రైమ్ ఆధారంగా తొలగించారు. 'ఇది కేవలం ఆరంభం మాత్రమే మా దగ్గర ఉన్న లిస్ట్‌ని అప్డేట్ చేస్తూ వెళ్తాము' అంటూ ట్విట్టర్ అకౌంట్ వేదికగా 'మా' ప్రకటించింది. ప్రస్తుతానికి 'జస్ట్ వాచ్ బిబిసి', 'ట్రోల్స్ రాజా', 'బాచిన లలిత్', 'హైదరాబాద్ కుర్రాడు', 'ఎక్స్ వై జెడ్ ఎడిట్స్ 007' అనే యూట్యూబ్ ఛానల్స్‌లను తొలగించారు.

'ది గోట్' ఫస్ట్ సింగిల్ విడుదల

విజయ్ హీరోగా, వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). ఎజీఎస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి, వైభవ్, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీ అందించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనుంది. ఆగస్ట్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఓపెనర్లే బాదేశారు

నాల్గో టి20లో జింబాబ్వేపై 10వికెట్ల తేడాతో గెలుపు ● సిరీస్ 3–1తో కైవసం

హరారే: జింబాబ్వే పర్యటనలో ఉన్న టీమిండియా యువ జట్టు అంచనాలకు మించి రాణిస్తోంది. శనివారం జరిగిన నాల్గో టి20లో టీమిండియా ఏకంగా 10 వికెట్ల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేను నిర్ణీత 20ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులకే పరిమితం చేసింది. కెప్టెన్ సికిందర్ రాజా(46; 28బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు) రాణించాడు. తొలుత జింబాబ్వే ఓపెనర్లు మదివెరే, మరుమని తొలి వికెట్‌కు 63పరుగులు జోడించి శుభారంభం అందించారు. టీమిండియా బౌలర్లలో ఖలీల్ అహ్మద్‌కు రెండు, తుషార్ దేశ్ పాండే, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ, శివమ్ దూబేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని టీమిండియా 15.2ఓవర్లలో ఛేదించింది. .జైస్వాల్(93), శుభ్‌మన్(58) వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జైస్వాల్‌కు లభించింది.

జింబాబ్వే ఇన్నింగ్స్: మధవెరె (సి)రింకు సింగ్ (బి)దూబె 25, మరుమణి (సి)రింకు సింగ్ (బి)అభిషేక్ శర్మ 32, బెన్నెట్ (సి)జైస్వాల్ (బి)సుందర్ 9, సికిందర్ రాజా (సి)శుభ్‌మన్ 9బి)తుషార్ దేశ్‌పాండే 46, క్యాంప్‌బెల్ (రనౌట్)బిష్ణోయ్ 3, మయర్స్ (సి అండ్ బి)ఖలీల్ అహ్మద్ 12, మధండే (సి)రింకు సింగ్ (బి)ఖలీల్ అహ్మద్ 7, ఫిరాజ్ అక్రమ్ (నాటౌట్) 4, అదనం 14. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 152పరుగులు. **వికెట్ల పతనం:** 1/63, 2/67, 3/92, 4/96, 5/141, 6/147, 7/152 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–32–2, దేశ్‌పాండే 3–0–30–1, బిష్ణోయ్ 4–0–22–0, సుందర్ 4–0–32–1, అభిషేక్ శర్మ 3–0–30–1, దూబె 2–0–11–1.

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 93, శుభ్‌మన్(నాటౌట్) 58, అదనం 5.(15.2ఓవర్లలో) 156పరుగులు. **బౌలింగ్:** నరవా 3–0–27–0, ముజరబాని 3.2–0–25–0, ఛటారా 2–0–23–0, ఫరాజ్ 4–0–41–0, రాజా 2–0–24–0, బెన్నెట్ 1–0–16–0

అంతిమ్‌కు 4, అమన్‌కు 7వ ర్యాంక్

పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ సీడింగ్ విడుదల

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత మహిళా రెజ్లర్లు అంతిమ్ పంగల్, అమన్ షెహ్రావత్‌లకు సీడింగ్ దక్కాయి. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యుడబ్ల్యుడబ్ల్యు) ప్రకటించిన తాజాగా ర్యాంకింగ్స్ 53కిలోల విభాగంలో అంతిమ్ 4వ ర్యాంక్‌లో నిలువగా.. అమన్ షెహ్రావత్ 57కిలోల విభాగంలో 7వ ర్యాంక్ దక్కింది. అంతిమ్ పతకం నెగ్గే క్రమంలో ఆమె టాప్‌సీడ్ లూసియా(ఈక్వెడార్), 5వ సీడ్ మారియా(గ్రీస్), 8వ సీడ్ ఆంద్రీవా(రొమేనియా)ల ను ఓడించాల్సి ఉంది. ఇక అమన్ స్వీడన్‌కు చెందిన 2వ సీడ్ ఎమ్మా మాల్మ్‌గ్రీన్, 3వ సీడ్ అకారి(నైజీరియా), 6వ సీడ్ క్రిస్టియానా(చైనా)తో పాటు 7వ సీడ్ క్విన్‌యూ(చైనా)ను చిత్తుచేస్తేనే పతకం దక్కనుంది. 2సార్లు ప్రపంచ రెజ్లింగ్ పోటీల కాంస్య పతక విజేత వినేశ్ పోగాట్ ఈ ఒలింపిక్స్‌కు దూరంగా ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68